J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 42 సంచిక : 43 31.03.2023, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి



• వైయస్ఆర్ కాంగ్రెస్

# నాయకుడు బలం.. పార్టీ బలహీనం

- వికటిస్తున్న విధానాలు- విఫలమవుతున్న వ్యూహాలు
- సమర్థత లేని సలహాదారులు - పనికిరాని సలహాలు
- సమయం ఇవ్వని సీఎం - సహనం కోల్పోతున్న శాసనసభ్యులు
- జనంలో జగన్‌పై పెరుగుతున్న క్రేజ్ - క్షేత్రస్థాయిలో డామేజ్ అవుతున్న పార్టీ ఇమేజ్

***ఆంధ్ర వైసీపీలో ద్వితీయశ్రేణి నాయకత్వంపై నివురుగప్పిన నిప్పులా ఉండిన అసమ్మతి ఇప్పుడు బయటకి పొంగుతోందా...? ఇన్నాళ్లూ తమలో తాము గుసగుసలాడుకుంటుండిన నాయకులు ఇప్పుడు బహిరంగంగా మాట్లాడుతున్నారా...?? తాజాగా జరిగిన పట్టభద్రులు, ఎమ్మెల్యేల కోటా ఎంఎల్‌సీ ఎన్నికల తరువాత అసమ్మతివాదులలో ధైర్యం వచ్చిందా..???***

పై ప్రశ్నలన్నిటికీ అవుననే సమాధానమే వినపడుతోందంటున్నారు విశ్లేషకులు. పైరెండు ఎన్నికల ఫలితాలలో తెలుగుదేశం 4 ఎమ్మెల్సీ సీట్లు గెలుచుకోవడం తమ పార్టీ ద్వితీయశ్రేణుల తప్పటడుగులే అన్న అంశం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారిందన్నది వారి అభిప్రాయం.


తప్పు ఎవరిది..? పట్టభద్రుల ఎన్నికలలో అభ్యర్థుల ఎంపికలో కీలకపాత్ర పోషించింది ఎవరు..?? సొంత పార్టీ ఎమ్మెల్యేలు అధికారపార్టీకి వ్యతిరేకంగా ఓటు వేసేలా వారికి పొగపెట్టింది ఎవరు..??? క్రాస్ ఓటింగ్ జరగబోతోందని ముందుగానే గ్రహించలేకపోయింది ఎవరు..???? పార్టీ నుండి సస్పెండ్ చేయాల్సింది ఎవరిని????? సామాజిక మాధ్యమాలు, యు ట్యూబ్ ఛానెళ్ళు వేదికగా ఇలాంటి భేతాళప్రశ్నలు వైసీపీ అధిష్టానంపై సంధిస్తూనే ఉన్నారు నెటిజన్లు. సార్వత్రిక ఎన్నికలలో పార్టీ ఓడిపోయేంతగా ఈ ఫలితాలు ప్రభావం చూపలేకపోవచ్చు. కానీ జగన్ ఆశించినట్లుగా 175కి 175 సాధించాలన్న లక్ష్యం ప్రశ్నార్ధకమయ్యేలా ఓటర్లను ప్రభావితం చేస్తాయనడంలో అనుమానం లేదని విశ్లేషకులు అంటున్నారు. బలమైన అధికారపార్టీ రాజకీయంగా అవలంభించాల్సిన విధానాలలో తప్పటడుగువేస్తోందనడంలో సందేహం లేదన్నది వారి భావన.

వ్యూహరచన చేయడంలో తమ పార్టీ ద్వితీయశ్రేణి నాయకులు ఫెయిల్ అవుతున్నారని పార్టీ శ్రేణులు అభిప్రాయపడుతున్నారు. జరుగుతున్న సంఘటనలను, జరగబోయే పరిణామాలను క్షేత్రస్థాయిలో తిరిగే నాయకులు ముందే ఊహించి ద్వితీయశ్రేణి

10లో

**వైసీపీలో ఏం జరుగుతోంది!?**

మనలో మాట.. 11లో



# ప్రజలు కోరుకున్నచోట దేవాలయాలు

## - మంత్రి కాకాణి



గ్రామాల్లో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రజల విజ్ఞప్తి మేరకు ఆయా ప్రాంతాల్లో దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల ఆయన పొదలకూరు మండలం మహమ్మదాపురం గ్రామంలో తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్ట్ నిధులతో నిర్మించనున్న శ్రీ రాధాకృష్ణ మందిర నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి విలేకర్లతో మాట్లాడుతూ, ఏ గ్రామాల్లో ఆలయాలు నిర్మించాలని ప్రజలు కోరుకుంటారో ఆ ట్రస్ట్ నిధులతో, సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నూతన ఆలయాల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నట్లు చెప్పారు. సర్వేపల్లి నియోజకవర్గంలో ఇప్పటి వరకు 28 దేవాలయాలను టిటిడి సహకారంతో మంజూరు చేయించి నిర్మాణాలు చేపట్టడం జరిగిందన్నారు. ఒక్కొక్క దేవాలయానికి 10లక్షల రూపాయల వంతున 2.80కోట్ల రూపాయలు మంజూరయ్యాయని, అదేవిధంగా పొదలకూరు మండల పరిధిలో 9 దేవాలయాలు, ఒక్కొక్క దేవాలయానికి 10 లక్షల రూపాయల వంతున 90 లక్షల రూపాయలు మంజూరైనట్లు మంత్రి వివరించారు. సర్వేపల్లి నియోజక వర్గ పరిధిలో 50 దేవాలయాలను నిర్మించాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు మంత్రి చెప్పారు.

# టెన్త్ విద్యార్థులకు.. వీడ్కోలు సభ



నెల్లూరు జాకీర్‌హుస్సేన్ నగర్‌లో ఉన్న ఎస్‌వీఆర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆధ్వర్యంలో ఆదివారం 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు వీడ్కోలు సభ జరిగింది. స్కూల్ కరెస్పాండెంట్ అందే శ్రీనివాసులు మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, విద్యార్థులంతా సమాజ శ్రేయస్సుకు, దేశ అభివృద్ధికి దోహదపడాలని కోరారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. ప్రిన్సిపాల్ బి.రమేష్ బాబు, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె. మురళీమోహన్‌రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్సీ మేరిగకు..రాపూరులో ఘనస్వాగతం

కొత్తగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఎమ్మెల్సీ మేరిగ మురళికి తిరుపతి, నెల్లూరుజిల్లాల్లో ప్రజలు ఘనంగా స్వాగతిస్తూ ఆయన పట్ల తమకున్న అభిమానాన్ని చాటుకుంటున్నారు. ఇటీవల మండల కేంద్రమైన రాపూరులో మేరిగ మురళి అభినందన సభ అద్వితీయంగా జరిగింది. ప్రజలు, ముఖ్యంగా మహిళలు అడుగడుగునా హారతులతో ఆయనకు స్వాగతం పలకడం విశేషం. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటగిరి నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త, ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్‌బోర్డు ఛైర్మన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, తదితర నాయకులను ప్రజలు పెద్దఎత్తున స్వాగతించారు. మద్దెలమడుగు కూడలిలోని శ్రీకృష్ణ దేవాలయంలో నాయకులు తొలుత పూజలు చేశారు. అనంతరం, అక్కడినుండి ర్యాలీగా రోడ్‌షో పండుగ వాతావరణాన్ని తలపించింది. బాణసంచా వేడుకలతో, అడుగడుగునా యువత పూలు చల్లుతూ, మంగళ వాద్యాలతో, నృత్యాలతో వారిని సభా ప్రాంగణానికి తీసుకొచ్చారు. స్థానిక ముఖ్య నాయకులు పాపకన్ను మధురెడ్డి, పాపకన్ను దయాకర్‌రెడ్డి, మన్నెం కిషోర్‌కుమార్‌రెడ్డి, శ్రీకిరెడ్డి శశిధర్‌రెడ్డి, జెసిఎస్ ఇన్‌చార్జ్ దందోలు నారాయణరెడ్డితో పాటు పెద్దసంఖ్యలో నాయకులు తరలివచ్చి మేరిగ మురళిని ఘనంగా సత్కరించారు.

# మెడికవర్‌లో అరుదైన శస్త్రచికిత్స




కడుపు నొప్పి, ఉబ్బసం సమస్యతో గత మూడు నెలలుగా బాధపడుతున్న అలివేలమ్మ అనే 42ఏళ్ల మహిళకు క్లిష్టమైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించి పూర్తి ఉపశమనాన్ని కల్పించారు నెల్లూరులోని మెడికవర్ హాస్పిటల్ వైద్యులు. రోగి అలివేలమ్మ ఇటీవల విపరీతమైన కడుపు నొప్పితో బాధపడుతూ, మెడికవర్ ఆసుపత్రికి రాగా, సర్జికల్ అంకాలజీ విభాగానికి చెందిన డాక్టర్ అవినాష్ ఆమెను పరీక్షించారు. అనుమానంతో సీటీ స్కాన్ చేయగా గర్భాశయంలో పెద్ద కణితి ఉన్నట్లు గుర్తించారు. ఆ కణితి గర్భాశయాన్ని పూర్తిగా ఆక్రమించడంతో విపరీతమైన కడుపు నొప్పి వస్తున్నట్లు నిర్ధారించారు. కణితికి క్యాన్సర్ లక్షణాలు కూడా ఉన్నట్లు గుర్తించారు. వెంటనే శస్త్రచికిత్స నిర్వహించాలని రోగి కుటుంబసభ్యులకు తెలియజేయగా వారు అంగీకరించారు. దీంతో ఆమెకు డాక్టర్ అవినాష్ శస్త్ర చికిత్స నిర్వహించి కణితిని తొలగించారు. 30X30 సెంటీమీటర్ల వ్యాసార్థంతో ఉన్న ఆ కణితి 6కిలోల బరువున్నట్లు డాక్టర్ అవినాష్ తెలియజేశారు. శస్త్ర చికిత్స అనంతరం ఆమె పూర్తిగా కోలుకుని డిశ్చార్జ్ అయినట్లు పేర్కొన్నారు. ఆలస్యం అయి ఉంటే చాలా ప్రమాదకరంగా మారేదని అన్నారు. కణితికి క్యాన్సర్ లక్షణాలు ఉండటంతో ఆపరేషన్ సమయంలో పలు జాగ్రత్తలు తీసుకున్నామని తెలియజేశారు. ఈ ఆపరేషన్‌ను రోగి నుండి ఒక్కపైసా కూడా తీసుకోకుండా పూర్తిగా ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చేశామన్నారు.

# సిద్ధమ్మతల్లికి ప్రత్యేక పూజలు



మర్రిపాడు మండల పరిధిలోని రాజుపాళెం గ్రామంలో కొలువైవున్న శ్రీ సిద్ధమ్మ పేరంటాలు అమ్మవారికి ఈనెల 26న ఆలయ అర్చకులు వీరమ్మ ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి తరలివచ్చి, పొంగళ్లు వండి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

# బంధాలు.. అనుబంధాలను చాటే.. 'ఆ నలుగురా..!?'

ఒక మంచి కథా రచయితగా బొందల నాగేశ్వరరావు తెలుగు పాఠకలోకానికి సుపరిచితులే! ఆయన వృత్తిరీత్యా మద్రాసు పోర్టు ట్రస్ట్‌లో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేసి, ప్రస్తుతం విశ్రాంత జీవితం గడుపుతున్నారు. ఆయన ప్రవృత్తి రచనలు చేయడం. చాలాకాలంగా ఆయన కథలు, కవితలు, నాటకాలు, నాటికలు రాశారు, రాస్తున్నారు. అంతేగాక టి.వి. సీరియళ్ళు, డబ్బింగ్ సినిమాలకు మాటలు, పాటలు సమకూర్చారు. 72 ఏళ్ళ వయసున్న నాగేశ్వరరావు మొదటికథ 1972లో ఆంధ్ర సచిత్ర వారపత్రికలో అచ్చు యింది. అప్పటినుంచి విరామం లేకుండా ఆయన రచనలు చేస్తున్నారు.


ఆ విధంగా వివిధ పత్రికల్లో వచ్చిన కథలను ఏర్చికూర్చి ఈ కథాసంకలనాన్ని ప్రచురించారు. నేటి సమాజానికి అవసరమైన బంధాలు, అనుబంధాలు, రక్త సంబంధాలతో కూడుకున్న సాంఘిక, కుటుంబ నేపథ్యంలో సఖ్యత కొనసాగించే స్ఫూర్తిదాయకమైన కథలను రాస్తూ కొనసాగాలన్నదే తన లక్ష్యంగా చెప్పుకునే బొందల నాగేశ్వరరావు కథలను కొన్నింటిని స్థాలీపులాక న్యాయంగా పరిశీలిద్దాం.

'నాన్నా! మీరు కావాలి' అన్న కథలో మద్యపానం అనే వ్యసనం కుటుంబ వ్యవస్థను ఎంత నాశనం చేస్తుందో వివరంగా తెలిపారు. ముఖ్యంగా పసిపిల్లల హృదయాలను ఎంత క్షోభింపచేస్తుందో కళ్ళకు కట్టారు. మంచి సందేశాన్ని పాఠకులకందించారు.

రైలులో పల్లీలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్న ఒక వృద్ధురాలి వెతలను వివరిస్తూ, జీవితంలో ఎదురయిన ఆటుపోటులను ఆమె ధైర్యంగా ఎలా ఎదుర్కొన్నదీ చెప్పారు. అంతేగాక ఆమెలోని ప్రేమను, కరుణను, తనలాంటి దీనుల, అనాథల పట్ల ఆమె ఔదార్యాన్ని హృద్యంగా చిత్రించారు. ఆర్థికంగా దిగువన ఉండేవారు హార్దికంగా ఎంత ఉన్నతంగా ఉంటారో 'ఆ నలుగురా' అన్న కథలో చెప్పారు.

'అదో పిచ్చిమాలోకం' – అన్న కథలో పరస్త్రీ వ్యామోహం ఎంత చెడ్డదో తెలియజేశారు. పెద్దచదువులు చదివి, విదేశాలకు వెళ్ళి, మంచి ఉద్యోగాల్లో స్థిరపడి, తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తున్నారు పిల్లలు. అనారోగ్యానికి గురై చూడాలని ఉంది, రండి.. అని పిలిచినా వాళ్ళు పట్టించుకోలేదన్న ఆవేదనను "నా దృక్కోణంలో" అన్న కథలో కళ్ళకు కట్టారు రచయిత.

ఎంత ప్రయత్నించినా, కొన్ని తప్పుల్ని సవరించుకోలేమన్న విషయాన్ని చాటిచెప్తున్న కథ "మేము తప్పు చేశాము". నాలుగేళ్ల వరకు పిల్లల్ని వద్దనుకున్నారు భార్యాభర్తలిద్దరు. మూడుసార్లు గర్భవిచ్చిత్తికి పాల్పడ్డారు. నాల్గవసారి గర్భస్రావం అయింది. ఇక మీద గర్భవతి అయితే, ఆమె ప్రాణాలకే ముప్పు వాటిల్లగలదని డాక్టర్ హెచ్చరించాడు. ఈ దంపతుల కథ పాఠకులలో వారిపై జాలి కల్గిస్తుంది. ప్రకృతికి భిన్నంగా ప్రవర్తిస్తే ఏమవుతుంది? అన్న ఆలోచన కల్గిస్తుంది.




ఆ నలుగురా...!?
రచయిత: బొందల నాగేశ్వరరావు
వెల. 130/-
ప్రతులకు: బొందల నాగేశ్వరరావు
సుందరి నివాస్, నెం. 31,
మొదటి వీధి, వాసుకి నగర్,
కొయంగైయూడు, చెన్నై - 600 118.
సెల్. 95000 20101

కుటుంబాల్లో తొంగిచూసే చిన్నచిన్న పొరపొచ్చాలను, అతి సున్నితమైన మాటల్లో కథలుగా మలచడంలో నాగేశ్వరరావు సిద్ధహస్తులు. 'మబ్బులు వీడాయి' అన్న కథలో భార్య మీద అనుమానం వున్న సుందర్‌లోని సందేహపు పొరలను చిన్న సంఘటన ద్వారా తొలగిపోయేటట్లు చేశారు. అనుమానం పిశాచం వంటిది. పట్టుకుంటే వదలదు. దాని బారిన పడకూడదని హితవు చెప్పిన్నదీ కథ.

కొన్ని కథల్ని ప్రారంభంలో హాస్యరసస్ఫోరకంగా నడిపిస్తారు రచయిత. ముగింపు సమయంలో, సన్నివేశాల్లో కొన్ని మలుపులు తిప్పి మన అంచనాలను తారుమారు చేస్తారు. విద్యుల్లతలాంటి మలుపులను మెలకువతో సృష్టించడంలో రచయిత రచనా కౌశలం చెప్పుకోతగింది.

నాగేశ్వరరావు కథలు పాఠకుల్ని ఆసాంతం చదివింపజేస్తాయి. అంతేగాక చదివాక ఆలోచింపజేస్తాయి. పొరపాట్లేమైనా ఉంటే సరిదిద్దుకో, బాగుపడతావు అంటూ ఆప్తమిత్రుడిలా హితోపదేశం చేస్తాయి. 'పుస్తకం మంచి నేస్తం' అన్న విషయాన్ని ఋజువు చేస్తాయి. ఇప్పటికి మూడు కథా సంకలనాలను వెలువరించి వున్నారు రచయిత. ఇది నాలుగవది.

ముందు ముందు ఆయన్నుంచి మరిన్ని కథా సంకలనాలు వెలువడాలని కోరుకుంటూ... అభినందనలు.




**డా. గంగిశెట్టి శివకుమార్**
94418 95343

## 'కళ్యాణ రాముడు'



కౌసల్యపుత్రుండు కమనీయరూపుండు
దశరథ తనయుడు ధర్మతేజుండు
అనుజుల ముప్పురితో అల అయోధ్యపురమందు
అవతార పురుషుడై ఆవిర్భవించె
జగతి జనులెల్ల జయము పలుక॥
సకల శాస్త్రముల్ వశిష్టుకడ పఠనమందె
విశ్వామిత్ర దరిజేరి విశ్వరహస్యముల్ తెలిసి
మారీచాది దానవవీరుల మట్టుబెట్టి
యజ్ఞయాగాదుల గాచి యశము పొంది
గాధేయు శిష్యుడై మిథిలాపురముజొచ్చి
శివచాపమ్ము నవలీల ద్రుంచి
జనకుని సింగారాలపుత్రి సీతమ్మను చేపట్టి,
కళ్యాణరాముడై, జానకీ రాముడై
మానవరూపాన మహిని బ్రోచె॥

**- వనం సుబ్రహ్మణ్యం**
94415 94897



# ఆయన పేరుతో ఒకరోజు

- అమెరికాలో మన నెల్లూరీయుడికి దక్కిన అరుదైన గౌరవం
- అలబామా రాష్ట్రంలోని "టస్కలూసా" నగరంలో ఇకపై మార్చి 28ని "డాక్టర్ రమేష్ పేరంశెట్టి రోజు"గా ప్రకటించిన నగర మేయర్ వాల్ట్ మెడాక్స్

**ఇది మన నెల్లూరీయుడికి దక్కిన అరుదైన గౌరవం. నిస్వార్ధ సమాజసేవతో నగర వాసుల ప్రశంసలందుకున్న సేవా సారథికి వారి హృదయాలలో కల్పించుకున్న అద్భుత స్థానం. అమెరికా దేశంలోని అలబామా రాష్ట్రంలో గల టస్కలూసా నగరంలో వైద్య ఆరోగ్య సేవా రంగాలలో పాతికేళ్ళ శ్రమకి గుర్తుగా లభించిన అపురూప సత్కారం.**



పేరంశెట్టి చిన గురునాథం – రాజేశ్వరమ్మల సంతానం డాక్టర్ రమేష్. పాత నెల్లూరుజిల్లా నాయుడుపేట సమీపంలోని మేనకూరు ఆయన స్వగ్రామం. చిన్నతనంలోనే నాన్నను కోల్పోయారు. జీవితంలో పైకి రావడానికి ఎన్నో కష్టాలు పడ్డారు. అహోరాత్రులూ శ్రమించి వైద్య పట్టా పుచ్చుకున్నారు. బ్రతుకుదెరువు వెతుక్కుంటూ విదేశాల బాట పట్టారు. కొంతకాలం జమైకాలో ఉండి, అనంతరం అమెరికాకు చేరుకున్నారు. అమెరికా దేశంలోని అలబామా రాష్ట్రంలో ఉన్న టస్కలూసా నగరంలో స్థిరనివాసం ఏర్పాటు చేసుకుని తన ప్రస్థానాన్ని ప్రారంభించారు డాక్టర్ రమేష్. నైపుణ్యం కలిగిన వైద్యుడిగా, దయార్ద్ర హృదయమున్న సంఘ సేవకుడిగా, తాను స్వయంగా ఆరోగ్య సూత్రాలను పాటిస్తూ, ఇతరులను అదే కోవలో ప్రోత్సహించే స్ఫూర్తిప్రదాతగా, చదువుకోసం అమెరికాకు వచ్చే తెలుగువారికి విద్యాదాతగా, బ్రతుకు బాట వెతుక్కుంటూ ఆమెరికాకి వచ్చేవారికి ఆపద్బాంధవునిగా రమేష్ కీర్తిప్రతిష్టలు గడించారు. రెండున్నర దశాబ్దాల ఆయన సేవానిరతికి ప్రతీకగా, అకుంఠిత దీక్షతో, అంకితభావంతో ఆయన అందించిన సేవలకు సముచిత గౌరవం కల్పిస్తూ ఆయనకి అత్యంత అమూల్యమైన స్థానం కల్పించింది టస్కలూసా నగరం.

మార్చి 28వ తేదీ టస్కలూసా నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆ నగర మేయర్ వాల్డ్ మెడాక్స్ మాట్లాడుతూ..

"డాక్టర్ రమేష్ పేరంశెట్టి టస్కలూసా నగర సమాజంలో కీలక సభ్యుడిగా ఉంటూ, 1998 నుండి వైద్య ఆరోగ్య రంగాలతో పాటు సేవారంగంలో సైతం తన సేవలు అందిస్తున్నారు. అలబామా ఫ్యామిలీ మెడికల్ సెంటర్, క్రిమ్సన్ కేర్ స్కైల్యాండ్, క్రిమ్సన్ కేర్ వెటరన్స్, క్రిమ్సన్ విలేజ్‌లతో పాటు టస్కలూసా వెయిట్ లాస్ సెంటర్ వ్యవస్థాపకులు మరియు మెడికల్ డైరెక్టర్‌గా సేవలందిస్తున్న కృషీవలుడు డాక్టర్ పేరంశెట్టి. అంతేకాదు, డాక్టర్ రమేష్ ఫెలో ఆఫ్ ది అమెరికన్ అకాడెమి ఆఫ్ ఫామిలీ ఫిజిషియన్స్‌గానే కాకుండా, అమెరికన్ సొసైటీ ఆఫ్ బేరియాట్రిక్స్ ఫిజీషియన్స్, అమెరికన్ కాలేజ్ ఆఫ్ ఫెల్బాలజీ, అమెరికన్ సొసైటీ ఆఫ్ లేజర్ మెడిసిన్&సర్జరీ వంటి ప్రముఖ సంఘాలతో పాటు అమెరికన్ అకాడమీ ఆఫ్ అస్థెటిక్ మెడిసన్‌లో కూడా సభ్యుడిగా ఉన్నారు.

వీటన్నింటినీ మించి కోవిడ్ –19 ప్రపంచాన్ని గడగడ లాడించిన తరుణంలో అత్యంత బాధ్యతాయుతంగా ఓ వైపు నిరంతరం వైద్యసేవలు అందిస్తూనే... మరోవైపు టస్కలూసా నగరపౌరులను చైతన్యపరుస్తూ, నిరుపమానమైన సేవలు అందించినందుకుగాను డాక్టర్ రమేష్ పేరంశెట్టికి ప్రశంసాపూర్వక గౌరవంతో, వాల్ట్ మెడాక్స్ అనే నేను నగర మేయర్‌గా టస్కలూసా నగర కౌన్సిల్ పక్షాన ఈరోజు నుండి మార్చి 28ని 'డాక్టర్ రమేష్ పేరంశెట్టి రోజుగా' ప్రకటిస్తున్నాను." అంటూ కరతాళధ్వనుల మధ్య ప్రకటించారు.






టస్కలూసా నగరానికి చెందిన న్యాయమూర్తులు, రక్షణశాఖ అధికారులు, నగర ప్రముఖులు, పోలీసు శాఖ ఉన్నతాధికారులు, వైద్య



రంగానికి చెందిన నిష్ణాతులు, వివిధ ప్రభుత్వ విభాగాల ప్రతినిధులు డాక్టర్ రమేష్ అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇకపై 'మార్చి 28వ తేదీని' టస్కలూసా నగరం 'డాక్టర్ రమేష్ పేరంశెట్టి రోజు'గా జరుపుకుంటుంది. ఆ నగరం మనుగడ సాగించినంత కాలం ఈ సంప్రదాయం కొనసాగుతుంది. రమేష్ పేరు ఆ నగర చరిత్రపుటల్లో చిరస్థాయిగా నిలిచిపోతుంది.

ఇది భారతీయుడికి దక్కిన అపూర్వ గౌరవం. మన తెలుగువాడికి లభించిన గుర్తింపు. అన్నింటినీమించి మన నెల్లూరీయుడు సాధించిన అద్భుత ఘనత.

## ఇది నా ఒక్కడి ఘనత కాదు - డాక్టర్ రమేష్

తనకు లభించిన ఈ అనూహ్యమైన గుర్తింపుకి, గౌరవానికీ ఉబ్బి తబ్బిబ్బైపోయిన డాక్టర్ రమేష్ పేరంశెట్టి ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇది తన ఒక్కడి ఘనత కాదని, తన ప్రయాణంలో తనకి సహకరించిన ప్రతి ఒక్కరికి ఈ గౌరవం దక్కుతుందని అన్నారు. ముఖ్యంగా కోవిడ్ సమయంలో ఎంతో సంయమనంతో తన సూచనలు సలహాలు పాటించిన టస్కలూసా పౌరులకు, వైద్య సేవలు అందించడంలో తనకు మద్దతుగా నిలచిన తన సహచర డాక్టర్లకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. పాతికేళ్ల తన ప్రస్థానంలో పరస్పర సహకారంతోనే ఈ స్థానాన్ని పొందగలిగానని అన్నారు. తనకి జన్మనిచ్చిన అమ్మా, నాన్నలను, అన్ని విషయాలలో తనకు అండగా ఉంటున్న తన కుటుంబసభ్యులను తానెప్పటికీ మరువలేనని, వారికి రుణపడివుంటానని అన్నారు.

ఇదొక అపురూప ఘట్టం. అనితరసాధ్యమైన విజయం. ఎవరైనా ప్రముఖులు వచ్చినప్పుడు వారి పేరుపైన ఈరోజు వారిది అని ప్రకటించడం, లేదా ఎవరైనా ఏదైనా అద్భుతాన్ని సాధిస్తే 'ఈరోజు వారిది' అంటూ అమెరికాలోని నగరాలలో సంబరాలు జరపడం ఆనవాయితీ. అది ఆ ఒక్కరోజుకే పరిమితం.

కానీ రమేష్ విషయంలో అలాకాదు, ఈ సృష్టి ఉన్నంత వరకు టస్కలూసా నగరపౌరులు మార్చి 28వ తేదీని "డాక్టర్ రమేష్ పేరంశెట్టి రోజు"గా జరుపుకుంటారు. ఇది మనవాడికి దక్కిన గుర్తింపు, మన నెల్లూరీయుడికి లభించిన గౌరవం. డాక్టర్ రమేష్‌కి 'లాయర్' అభినందనలు.

# ఏప్రిల్ 2న రెడ్‌క్రాస్ ఎన్నికలు



## 18 డైరెక్టర్ పదవుల కోసం 34 మంది పోటీ

## రెడ్‌క్రాస్‌పై క్రేజ్ పెంచిన చంద్రశేఖరరెడ్డి

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నెల్లూరుశాఖ కొత్త కమిటీ కోసం ఏప్రిల్ 2వతేది ఎన్నికలు జరగబోతున్నాయి. 3 సంవత్సరాల క్రితం జరిగిన ఎన్నికలు అప్పట్లో సంచలనంగా మారాయి. రాజకీయ ఎన్నికలను తలపించే తరహాలో సేవాసంస్థ ఎన్నికలు జరగడాన్ని చూసి చాలామంది ముక్కున వేలేసుకున్నారు. పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి అధ్యక్షతన ఏర్పడిన కమిటీ రెడ్‌క్రాస్ వేదికగా మంచి సేవాకార్యక్రమాలు నిర్వహించారన్న ఖ్యాతిని తెచ్చుకున్నారు. చంద్రశేఖరరెడ్డి అధ్యక్షుడైన తరువాత సంస్థ సభ్యత్వాలను కూడా అనూహ్యంగా పెంచారు. సేవా కార్యక్రమాల కోసం తన సొంత నిధులను కూడా భారీగా వెచ్చించారన్న పేరు తెచ్చుకున్నారు. రెడ్‌క్రాస్ అనుబంధ విభాగాలలో జరుగుతున్న స్వాహా కార్యక్రమాలకి అడ్డుకట్ట వేశాడన్న ఆక్రోశం కూడా చాలామందిలో ఉంది. వీటన్నిటినీ మించి కరోనా చంద్రశేఖరరెడ్డికి బాగా కలిసొచ్చింది. కరోనా సమయంలో రెడ్‌క్రాస్ అధ్యక్ష హోదాలో నిత్యం ప్రజలలో ఉంటూ, నిరంతర సేవా కార్యక్రమాలను నిర్వహించడంలో చంద్రశేఖరరెడ్డి రాష్ట్రస్థాయి గుర్తింపును, గవర్నర్ ప్రశంసలను, అంతర్జాతీయ సంస్థల సత్కారాలను కూడా అందుకున్నారు. ఆ గుర్తింపే ఆయనను శాసనమండలి సభ్యుడిగా గెలిచే స్థాయికి తీసుకెళ్ళింది. రాజకీయ పదవి వచ్చినా ఆయన తనకి ప్రాచుర్యాన్ని తెచ్చిపెట్టిన సంస్థను వదిలిపెట్టలేదు. తనతో పాటు మరో 17మంది అభ్యర్థులను కలుపుకుని ఇప్పుడు జరిగే ఎన్నికలలో పోటీ చేస్తున్నారు. తనకు పరిచయం, ప్రవేశమున్న రంగాలనుండి వ్యక్తులని ఎంపిక చేసుకుని ప్యానల్‌గా ఏర్పడి బరిలో దిగారు. ఎంఎల్‌సీ ఎన్నికలనే సునాయాసంగా గెలిచిన తమ నాయకుడికి ఈ ఎన్నిక పెద్ద లెక్క కాదంటున్నారు ఆయన శిష్య బృందం. ఆయన హయాంలో భారీగా పెరిగిన సభ్యత్వాలు, కరోనా సమయంలో ఆయన చేసిన సేవా కార్యక్రమాలు, అభ్యర్థుల ఎంపికలో ఆయన తీసుకున్న జాగ్రత్తలు ఆయనా, ఆయన సభ్యులు అవలీలగా గెలవడానికి ఉపకరిస్తాయన్నది వారి మాట.

చంద్రశేఖరరెడ్డి ప్యానల్‌లోని 18 మంది కాక మరో 16మంది పోటీలో ఉన్నారు. ఏప్రిల్ 2వతేదీ ఆదివారం ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకూ పోలింగ్ జరగనుంది. ఈసారి ఎన్నికలలో చంద్రశేఖరరెడ్డి ప్యానల్‌లో చాలామంది యోధానుయోధులు దిగారు. మూడేళ్ల క్రితం వరకు గుట్టుచప్పుడు కాకుండా జరుగుతుండిన రెడ్‌క్రాస్ ఎన్నికలకు చంద్రశేఖరరెడ్డి పుణ్యమా అని మంచి క్రేజ్ ఏర్పడింది. సేవాసంస్థ కోసం పనిచేయడానికి పోటీపడితే మంచిదేగా..!

లాయర్
మార్చి 31, 2023

# కరోనా పట్ల మనం జాగ్రత్తగానే ఉన్నామా?

'కరోనా మహమ్మారి వ్యాధి' పట్ల మనం అప్రమత్తంగానే ఉన్నామా?..ఆ రాకాసి వ్యాధి నియంత్రణకు అవసరమైన ముందస్తు జాగ్రత్తలను మనం నిజంగానే తీసుకుంటు న్నామా?.. అనే ప్రశ్నలకు సరైన సమాధానం ఉండడం లేదు. ఎందుకంటే, ఆ వ్యాధికి మనం ఆశించిన స్థాయిలో జాగ్రత్తలు తీసుకోవడం లేదనేది బహిరంగ రహస్యమే. కరోనా విజృంభణ సమయంలో దేశం ఎంతోమంది ప్రముఖులను, ప్రజలను కోల్పోయింది. దేశమే కాదు, ప్రపంచమంతా దానిదెబ్బకు వణికిపోయింది. ప్రపంచ మానవాళి చరిత్రలోనే ఇదొక భయం కరమైన అధ్యాయం. అలాంటిది మనదేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆగమేఘాల మీద తీసుకున్న ఎన్నో రకాల ముందు జాగ్రత్తల మూలంగా కొంతమేరకైనా దానిని అరికట్ట గలిగడం, కోట్లాదిమంది ప్రజలను ఆ వ్యాధి బారిన పడకుండా కాపాడగలగడం అపూర్వమైన విషయం. ఎట్లనో ఆ విషాదం సమసిపోతున్నదనుకుంటున్న తరుణంలో, ఇప్పుడా వ్యాధి ఇంకా ప్రపంచాన్ని భయపెడుతూనే ఉంది. అనేక దేశాల్లో కరోనా కేసులు నేటికీ పెరిగిపోతూనే ఉన్నాయి. మరణాలు కూడా సంభవిస్తూనే ఉన్నాయి. అనేక రకాల రూపాలతో (వేరియంట్) కరోనా మానవాళికి ఒక పెనుప్రమాదంగా పరిణమించి ఉంది. ఇప్పటికే తాజా లెక్కల ప్రకారం (మార్చి 28 నాటికి) కరోనా ప్రారంభమైనప్పటి నుంచి, అంటే మూడేళ్ళ క్రితం నుంచి ఇప్పటిదాకా ప్రపంచంలో 68.34 కోట్ల కరోనా కేసులు వచ్చాయంటే, కరోనా వీరంగం ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతోంది. ఈ వ్యాధికి ఇప్పటిదాకా 68.27 లక్షల మంది మరణించారంటే కరోనా మరణమృదంగం ఎంత దారుణంగా ఉందో తేటతెల్లమవుతోంది. ఇంకా దాదాపు 40 వేలమందికి పైగానే కరోనాతో చావుబతుకుల మధ్య పోరాడు తూనే ఉన్నట్లు గణాంకాలు చెపుతున్నాయి. వైద్యులు దేవుళ్లలా వచ్చి కోట్లాదిమంది ప్రాణాలను కాపాడుతూనే ఉన్నా, ఇంకా అనేకమంది మరణిస్తూనే ఉన్నారు. కరోనాతో, కరోనా వచ్చి బతికి బట్టకట్టినా, ఆ తర్వాత వచ్చే రకరకాల వ్యాధులతో మనిషి ఇంకా నలిగిపోతూనే ఉన్నాడు. మనదేశంలోనూ కరోనా (కోవిడ్) పోలేదు. నీడలా వెంటాడుతూనే ఉంది. కరోనా ఒకవైపు, ఇన్ఫ్లుయెంజా వ్యాధి మరోవైపు ప్రజలను భయ పెడుతూ, కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ, గుజరాత్, ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్‌లలో ప్రస్తుతం ఇంకా కరోనా కేసులు పెరుగు తూనే ఉన్నాయి. ప్రపంచంలో ఆ విషపు వ్యాధి ఎక్కడున్నా అన్నిదేశాల్లోనూ జాగ్రత్తలు పాటించాలి. లేకుంటే వచ్చే ప్రమాదం ఎంత భయంకరంగా ఉంటుందో కరోనా విజృంభణ రోజుల్లో చూసిందే కదా!..ఇప్పటికే కరోనా మరో కొత్త వేరియంట్ 'ఎస్‌బిబి 1.16-ఆర్క్టురాస్' అనే రూపంతో విజృంభిస్తోంది. గత జనవరిలో బయటపడ్డ ఈ కేసులు క్రమేణా వ్యాపిస్తున్నాయి. అయితే, 'అది మనదాకా రాదులే.. రాలేదులే' అనుకోకుండా ప్రతిరాష్ట్రంలో ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉండాల్సిన కీలక సమయమిది. అందుకే కేంద్ర ప్రభుత్వం ఈ వ్యాధిపట్ల ప్రజలను పదేపదే అప్రమత్తం చేస్తోంది. దేశంలో కోవిడ్ కేసులు క్రమేణా పెరుగుతున్నాయని, కోవిడ్ నిబంధనలను పాటించాలని స్పష్టం చేస్తోంది. దేశ వ్యాప్తంగా వైరల్ ఫీవర్లు, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో, ఆసుపత్రుల్లో అన్ని వసతులు ఉండేలా చూడాలని చెప్తోంది. కరోనా నిర్ధారణ పరీక్షల్లో పాజిటివ్ కేసులు బాగా పెరుగుతున్నట్లు కూడా కేంద్రం గుర్తించి, ఆ వ్యాధి బారిన పడకుండా అందరూ జాగ్రత్తలు తీసుకోవాలని, ఆ వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహన కలిగేందుకు దేశమంతటా మాక్‌డ్రిల్ నిర్వహించడానికి కూడా కేంద్రం ఏర్పాట్లు చేస్తోంది. మానవాళిని కబళించడానికి కరోనారాకాసి పొంచి ఉన్న తరుణంలో ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉండాలం టోంది. అందరూ వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, బయటకు వెళ్ళేటప్పుడు తప్పనిసరిగా మాస్క్ పెట్టుకోవాలని, క్రమం తప్పకుండా చేతులు శుభ్రంగా ఉంచు కోవాలని, శానిటైజర్స్ వినియోగించాలని కేంద్రప్రభుత్వం తాజాగా మార్గదర్శకాలను కూడా విడుదల చేసింది. కోవిడ్ నిర్ధారణ పరీక్షలు వీలైనంత ఎక్కువ చేయాలని, ఎవరికైనా ఆ లక్షణాలుంటే వెంటనే వారికి తగు చికిత్సలు చేయించాలని రాష్ట్రప్రభుత్వాలకు, వైద్యవర్గాలకు సూచిస్తోంది. అందువల్ల తాత్సారం చేయకుండా, కరోనా పోయిందిలే అనుకోకుండా, దేశంలోని ప్రతిఒక్కరూ ఆ వ్యాధి నియంత్రణకు ఎవరికి వారు జాగ్రత్తలు తీసుకోవడం, ప్రభుత్వాలు సూచిస్తున్న నియమ నిబంధనలు పాటించడం అవసరం..అత్యవసరం!...

# భాజపా తొందరపాటుతో తప్పుచేస్తోంది!

రాహుల్‌గాంధీ విషయంలో భారతీయ జనతాపార్టీ తొందరపాటుతో తప్పు చేస్తోంది అనిపిస్తోంది. ప్రధానమంత్రిని హేళనచేసిన విషయంలో కోర్టు శిక్ష విధించడాన్ని కాదనలేము, కానీ అదే కోర్టు పైకోర్టుకి వెళ్ళడానికి నెలరోజులు సమయం కూడా ఇచ్చింది కదా..! తదుపరి కోర్టు నిర్ణయం వచ్చేవరకు భాజపా ఆగుంటే బాగుండేదేమో అని నా అభిప్రాయం. కేంద్రప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలు, ఆర్థిక వ్యవహారాలలో తీసుకుంటున్న పాలసీ నిర్ణయాలు, ఇతర దేశాలతో ఏర్పరచుకుంటున్న స్నేహసంబంధాలు వంటి అంశాలు ప్రధాని మోడీకి, ఆయన ద్వారా భాజపాకి అంతర్జాతీయంగా గుర్తింపు తీసుకొస్తున్నాయి. ఇలాంటి తరుణంలో రాజకీయపరంగా తీసుకునే ఇలాంటి నిర్ణయాలు భారతీయ జనతా పార్టీని, తద్వారా మోడీ ప్రతిష్టను దెబ్బ తీస్తాయనడంలో నాకు ఎలాంటి సందేహంలేదు. ఇప్పటికే అనేక ప్రాంతాలలో కనుమరుగైన కాంగ్రెస్‌పార్టీ గురించి, ముఖ్యంగా ఇంతలా స్పందించాల్సిన అవసరం లేదు. ఒక్కొక్కసారి ఇలాంటి నిర్ణయాలవల్ల ప్రత్యర్థులకే మేలుజరిగే అవకాశం కూడా ఉంది.

*- కే.వీ.సుబ్రహ్మణ్యశర్మ, హైదరాబాదు.*

# మితిమీరుతున్న ఆటోల ఆగడాలు!

నెల్లూరు నగరంలో ట్రాఫిక్ అధ్వాన్నంగా తయారవుతోంది. ముఖ్యంగా ఆటోవాలాల ఆగడాలు మితిమీరుతున్నాయి. ఎక్కడపడితే అక్కడ ఇష్టారాజ్యంగా ఆపేస్తున్నారు. వేగంలో కూడా అదుపు లేదు. ద్విచక్ర వాహనములో వెళ్ళాలన్నా, నడుస్తూ రోడ్డు దాటాలన్నా వీళ్ళ వేగానికి వణుకుపుడుతోంది. కార్లలో వెళ్లేవాళ్ళు కూడా భయపడేంతగా ఆటోడ్రైవర్ల వేగం ఉంటుంది. ముఖ్యంగా జనం ఎక్కువగా వుండే మార్కెట్, బస్‌స్టాండ్, రైల్వేస్టేషన్ వంటి రద్దీ ప్రాంతాలలో ఆటోడ్రైవర్ల ఆధిపత్యమే కొనసాగుతోంది. వీళ్ళు ఇష్టారాజ్యంగా అడ్డదిడ్డంగా పార్కింగ్ చేసినా అడగడానికి లేదు. మహిళల పట్ల కూడా కొంతమంది ప్రవర్తన బాగుండడంలేదు. తప్పుచేసినా ప్రశ్నించడానికి లేదు. ఒకవేళ ఎవరైనా సామాన్య జనం ప్రశ్నిస్తే డ్రైవర్లంతా ఒక్కటై వారిమీద తిరగబడతారు. అంతా మా ఇష్టం అన్నట్లుగా ప్రవర్తిస్తున్న ఆటోవాలాల ఆగడాలను అదుపుచేయవలసిన బాధ్యత పోలీసుశాఖపై ఉంది. కానీ, తమిళనాడు తరహాలో నగరంలో తిరిగే 70శాతంకుపైగా ఆటోలకు యజమానులు పోలీసువారే అంటున్నారు. అదే నిజమైతే, ఇంక ఈ ఆటోలను అదుపుచేయడం దేవుడికి కూడా సాధ్యంకాదేమో..!

*- ఎం.కాత్యాయని, రంగనాయకులపేట.*




### పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలు
# పకడ్బందీగా నిర్వహించాలి

ఈమధ్య తెలంగాణ పబ్లిక్ పరీక్షల లీకేజీ వ్యవహారం గొప్ప దుమారం రేపింది. అదృష్టవశాత్తు మన రాష్ట్రంలో అలా జరగ లేదు. అయినా పరీక్షలు పకడ్బందీగా నిర్వ హించుటకు ఈ చర్యలు తీసుకోవాలి. 1) ప్రశ్నాపత్రాలు 3సెట్స్(ఇంటర్మీ డియట్ పరీక్షల మాదిరిగా) 'కీ' (సమాధానాల)తో సహ తయారుచేయించాలి. వాటి ప్రింట వుట్స్‌ను పబ్లిక్ సర్వీస్ ఛైర్మెన్ ఆఫీసు గదిలో ఆయన బాధ్యతమీద భద్రపరచాలి. 2) ఆ ప్రశ్నాపత్రాలన్నింటికీ బార్‌కోడ్ నెంబర్‌తో ప్రింట్ చేయించాలి. ఎక్కడ లీక్ అయినా ఏ నెంబర్‌గల ప్రశ్నాపత్రం లీక్ అయిందో సులభంగా తెలుస్తుంది. 3) మూడుసెట్స్‌లో లాటరీ పద్ధతి ద్వారా ఒక దానినే ఎంపిక చేసి పరీక్షలు జరిగే రోజుననే రెండుగం టల ముందు తెలియచేసి అన్ని సెంటర్స్‌లో అదే సెట్ పత్రాలనివ్వాలి. అప్పటికీ 'అవుట్' అయితే ఏ సెంటర్‌లో అలా జరిగిందో అక్కడే రద్దుచేసి వాయిదా వేయాలి.

*భట్టారం భవానీశంకర్,*
రిటైర్డ్ వి.ఆర్.సి ప్రిన్సిపాల్, నెల్లూరు.

# జంక్ ఫుడ్..ఆరోగ్యం ఫట్



'ఒరేయ్ నాయినా.. చెత్తాచెదారం తినబా కండి..కడుపులు చెడగొట్టుకోబాకండి'..అంటూ మన పెద్దవాళ్లు తరచూ చెప్తూనే ఉంటారు. ఆ 'చెత్తాచెదారాన్నే' నేటి ఆధునిక కాలంలో 'జంక్ ఫుడ్' అంటుంటారు. 'ఫాస్ట్ ఫుడ్' అని కూడా దానికి మరోపేరు. సరైన పోషక విలువలు లేని, నాశిరకం, లేదా అనారోగ్య కరమైన ఆహారాన్నే ముద్దుగా జంక్‌ఫుడ్ అనేస్తుంటారు. పిజ్జాలని, బర్గర్లని రకరకాల పేర్లతో మన వంట్లోకి వెళ్లిపోతుంటాయి. చిప్స్ అని, స్నాక్స్ అని బోలెడన్ని రకాల ఫుడ్స్, అందమైన ప్యాకెట్లలో వచ్చేస్తుంటాయి. పండ్లు-కూరగాయలు వంటి ఆరోగ్య కరమైన పదార్థాలు వీటిలో దాదాపుగా ఉండవు. అందువల్ల వాటిని తింటే అనారోగ్యం గ్యారంటీ. ఏదో ఒక ఊళ్లో కాదు. దేశమంతా ఈ జంక్‌ఫుడ్ల పాశ్చాత్య సంస్కృతి ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతూనే ఉంది. ధూమపానం, మత్తుమందుల వాడకం లాగా ఈ జంక్‌ఫుడ్‌లు కూడా వ్యసనంగా మారుతున్నాయని, ఇవి తినడం వల్ల ఆరోగ్యం ఫట్ అయిపోతుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయినా, అన్నం తినడానికి కూడా నేటి యంత్రాల కాలంలో మనుషులకి తీరిక ఉండడం లేదు. ఇక అల్పాహారం లేదా ఉపాహారం సంగతిని ఎవరు పట్టించుకుంటున్నారు గనక!..ఆహారం అనేది ఆరోగ్యకరమైనదిగా, పౌష్టికాహారంగా ఉండాలని, రుచిగా-శుచిగా ఉండడం కూడా ముఖ్యమని ఆలోచించే సమయం కూడా ఎవరికీ ఉం డడం లేదు. ఏదో ఒకటి..వాళ్ళు ఫాస్ట్‌గా తయారుచేసి ఇచ్చేస్తుంటారు. వేడివేడిగా ఉంటాయి కాబట్టి వీళ్ళు గబగబా తినేస్తుంటారు. సరిగ్గా ఈ బలహీనతే వ్యాపారులకు బలంగా మారింది. ఊరూ వాడా అంతా ఈ ఫాస్ట్ ఫుడ్స్ లేదా జంక్‌ఫుడ్స్ దుకణాలు వెలిశాయి. ఇంకా వెలుస్తూనే ఉన్నాయి. ప్రతిచోటా వీధుల్లో బండ్ల మీద తినుబండా రాలకైతే లెక్కే లేదు. అన్నిచోట్లా ఇదో పెద్ద వ్యాపారంగా తయారైంది. వాటిని తినకుండా రోజు గడవని వారు ఎందరో ఉన్నారు. చిన్నపిల్లలు, పాఠశాల విద్యార్థు లైతే వీటిని తినడానికి ఆత్రపడుతుంటారు. అయితే, ఏది మంచో, ఏది ఆరోగ్యానికి ఇబ్బందో తెలుసుకుని తినడం ముఖ్యం. వాటిమీద ప్రజల్లో పెద్దఎత్తున అవగాహన కల్పించకపోతే, ఈ జంక్‌ఫుడ్‌లు ఆకాశమంత ఎత్తుకు ఎదిగిపోతాయి. ఆరోగ్యం చెడిపోయాక, లేనిపోని బాధలు పడడం, ఆసుపత్రులకు తిరగడం పెద్ద యాతనవు తుంది. ఏదంటే అది తినేస్తేనే సమస్య. తిన్నది సరిగ్గా అరగకపోవడం, శారీరకంగా

## సమస్యల తో 'రణం'

కడుపు ఉబ్బరం, ఊబకాయం రావడం, మధుమేహం, గుండెజబ్బులు, మానసికంగా కూడా వత్తిడి పెరగడం వంటి అనారోగ్యాలతో అవస్థలు పడుతుంటారు. ముఖ్యంగా చిన్నారులు, యువతీ యువకులు ఎక్కువగా ఈ జంక్‌ఫుడ్‌లకు బాగా అలవాటుపడిపో తున్నారు. ప్యాక్ చేసిన జంక్‌ఫుడ్స్‌తో పిల్లలు రోజులు గడుపుకుంటున్నారు. దీనవల్ల వారి ఆరోగ్యంపై తీవ్రప్రభావం ఉంటుందని, ఈ తరహా ఫుడ్స్‌కు వారిని దూరంగా ఉంచాలని నిపుణులు పదేపదే హెచ్చరిస్తున్నారు. అవి ఎప్పుడు తయారయ్యాయో, అవింకా చెడిపోకుండా ఉన్నాయా లేదా అని కూడా చూసుకోకుండా తినేసేవారు బోలెడంత మంది. ఇవన్నీ ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయని వేరే చెప్పనక్కర లేదు. ఇంట్లో అమ్మ, లేదా అమ్మమ్మలు చేసే మంచిమంచి తినుబండారాల కంటే కూడా, మార్కెట్లో దొరికే నానా చెత్త తినడానికే అనేకమంది ఇష్టపడుతున్నారు. ఎక్కువశాతం ఉద్యోగులు కూడా తీరికసమయాల్లో చిరుతిండ్లు ఏమి దొరుకుతాయో అని చూడడం మామూలై పోయింది. ఇంక పార్టీలు, పండుగలు పబ్బాలొస్తే ముందు రకరకాల జంక్‌ఫుడ్స్ ప్లేట్లలోకి వచ్చేస్తుంటాయి. పాతకాలంలో ఇళ్ళల్లో పెద్దవాళ్ళు ఊరగాయలు, పండుగల్లో అరిసెలు, కజ్జికాయలు, మురుకులు వంటి పదార్థాలను ఎంతో రుచిగా, నాణ్యతగా తయారుచేసి పెట్టేవారు. పిల్లలకే కాదు, పెద్దలకు కూడా ఇవి బాగా ఇష్టంగా ఉండేవి.

### డబ్బులిచ్చి అనారోగ్యాన్ని కొనితెచ్చుకోకండి

అప్పటి రోజులు పోయాయి. ప్రతిదానికీ మార్కెట్‌కు పరుగెత్తడం అలవాటైపో యింది. కూరగాయలే కాదు ఊరగాయలు కావాలన్నా దుకాణాల్లోనే. పండుగ అప్పచ్చులు కావాలన్నా దుకాణాలకే పరుగులు. అంగళ్ళలో అన్నీ దొరుకుతున్నాయి కదా.. ఇక ఇళ్లల్లో అదో పెద్ద పని ఎందుకు?.. హాయిగా కూర్చుని ఏ సీరియల్సో, లేకపోతే సెల్‌ఫోన్‌లో సినిమాలో చూసుకుంటుంటే సరిపోతుంది కదా! అనే ధోరణి వచ్చేస్తోంది సమాజంలో. అది మంచిదికాదు. అన్నీ అంగళ్ళలో ఉన్నాయి. తెచ్చుకోవ డానికి డబ్బులుండాలే గానీ, లేనిదేమీ లేదు. ఆర్డర్ చేస్తే చాలు..ఏ మూలన ఉన్నా అవే ఇంట్లోకి వచ్చి పడతాయి. అట్లని చెత్తాచెదారం తినకండి. డబ్బులిచ్చి అనారోగ్యాన్ని కొనుక్కోకండి. ఏది మంచిదో జాగ్రత్తగా చూసుకుని తినండి. మన కడుపుకు మనం తింటూ లేనిపోని బాధలు తెచ్చుకోవడం ఎందుకు?..ఆలోచించండి. ఇంట్లో పిల్లలకు మంచి ఆహారం తయారుచేసి పెట్టడం పెద్దల విధిగా ఉండాలి. వాళ్ళు బయట తినకుండా, మంచి తినుబండారాలు చేసిపెట్టాలి. దుకాణాల వద్ద పిల్లలకు ఏమైనా కొనిచ్చేటప్పుడు కూడా జాగ్రత్తలు పాటించాలి. పిల్లలకు పోషక విలువలుండే మంచి ఆహారం పెట్టండి. పెద్దలు కూడా జంక్‌ఫుడ్స్ తినడం మాని, ఆరోగ్యకరమైన ఆహారం తినడం అన్నివిధాలా మంచిది. అందులోనూ మన సంప్రదాయ వంటకాలు, మంచి మంచి తినుబండారాలు ఎన్నో ఉన్నాయి. అవన్నీ ఎంతో రుచిగానే కాదు, ఆరోగ్యంగా కూడా ఉంటాయి. అలాంటివాటిని వదిలేసి, జంక్ ఫుడ్స్ తినడం అన్నివిధాలా ఆరోగ్యానికి చేటు. 'చిరుతిళ్లు..చెడు తిరుగుళ్లు..మంచిది కాదనే' పెద్దల మాటను గుర్తుకు తెచ్చుకుని, 'మంచి ఆహారం..మంచి ఆరోగ్యం' అనే నినాదాన్ని ఆచరణలో పెట్టడం..మనకే కాదు, భావితరాలకు కూడా మంచిది.

*- సంచారి*

## చేపలు, పాడిపశువులకు మంత్రిత్వశాఖలు..
# ఓబీసీలకు మాత్రం లేవు

### - ఢిల్లీలో జరిగిన మహాధర్నాలో బిఎంఆర్ ఆవేదన

మనదేశంలో చేపలకు ప్రత్యేకంగా మంత్రిత్వ శాఖ, పాడిపశువులకు మంత్రిత్వ శాఖ ఉన్నాయి. కానీ భారత జనాభాలో సగభాగమైన ఓబీసీలకు మాత్రం ఇప్పటికీ ఒక మంత్రిత్వ శాఖ లేకపోవడం ఎంత దారుణం?.. అంటూ రాజ్యసభ సభ్యులు, మన నెల్లూరీయులు బీద మస్తాన్ రావు(బిఎంఆర్) ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి బీసీలకు ఒక ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, కేంద్ర బడ్జెట్లో కనీసం ఒక లక్ష కోట్ల రూపాయలను ఓబీసీల అభ్యున్నతికి కేటాయించాలని ఆయన ప్రధానమంత్రి నరేంద్రమోదీని కోరారు. రాష్ట్రీయ ఓబిసి మహాసంఘ్ అధ్వర్యంలో న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మార్చి28న నిర్వహించిన మహాధర్నాలో బిఎంఆర్ పాల్గొని ఉద్వేగంగా ప్రసంగించారు. ఓబీసీల హక్కుల సాధనకు ఉద్యమించాలని ఓబీసీలకు ఆయన పిలుపునిచ్చారు. బీసీల గళాన్ని దేశవ్యాప్తంగా, పార్లమెంట్ సాక్షిగా వినిపించడానికి ఈ మహాధర్నా చేస్తున్నామన్నారు. ఓబీసీ జాతికి అనాదిగా జరుగుతున్న అన్యాయాన్ని ఎదుర్కొంటూ, న్యాయం చేసేంతవరకు పోరాటం చేయాలని, నాయకుల కళ్ళు తెరిపించి హక్కులు సాధించుకోవాలని అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్పార్టీలో 9 రాజ్యసభ ఎంపీలలో 4 ఎంపీలను బీసీలకు వైఎస్ జగన్మోహన్రెడ్డి ఇచ్చారని,



ఆంధ్రప్రదేశ్లో 25 మంది మంత్రులలో 17 మంది మంత్రులను బడుగు, బలహీన, బీసీ, మైనారిటీ వర్గాలకు ముఖ్యమంత్రి కేటాయించారని తెలిపారు. వైకాపా తరఫున పార్లమెంటులో ఓబీసీల రిజర్వేషన్ల కోసం ప్రైవేట్ మెంబర్ బిల్లును ప్రవేశపెట్టామని, ఓబీసీల అభ్యున్నతికి కృషిచేసేందుకు తామెప్పుడూ ముందుంటామని ఆయన అన్నారు. రాష్ట్రీయ ఓబీసీ మహాసంఘ్ ఆధ్వర్యంలో ఓబీసీల హక్కులు మరియు డిమాండ్లపై బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ శాఖలు సంయుక్తంగా ఈ మహాధర్నాను నిర్వహించాయి. బిఎంఆర్తో పాటు, మోపిదేవి వెంకటరమణ, రాష్ట్రీయ ఓబీసీ మహాసంఘ్ అధ్యక్షులు శ్రీనివాస్, బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ శాఖ అధ్యక్షులు కేసిన శంకర రావు, ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్ యాదవ్, ఇతర రాష్ట్రాల ఓబీసీ నేతలు హాజరయ్యారు.

## పారిశుద్ధ్య కార్మికుల కష్టాలు తీర్చండి

నెల్లూరు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిశీలించి పరిష్కరించాలని కోరుతూ నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయం ఎదుట కార్మికులు మార్చి 28న ఆందోళన చేపట్టారు. ఏపి మున్సిపల్ వర్కర్స్ & ఎంప్లాయిస్ యూనియన్ - సిఐటియు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పారిశుద్ధ్య కార్మికుల కుటుంబాలను ఆదుకునేందుకు పరిహారం అందించాలని, కారుణ్య నియామకాల క్రింద వారి కుటుంబసభ్యులకు ఉద్యోగాలు ఇవ్వాలని కార్మికులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు కత్తి శ్రీనివాసులు, అశోక్, వజ్రమ్మ, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీసిటీ-'కెలాగ్స్'ఆధ్వర్యంలో విద్యార్థులకు పౌష్టికాహారం

శ్రీసిటీలోని కెలాగ్స్ పరిశ్రమ సత్యవేడు మండలంలోని చెరివి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో "బ్రైట్ స్టార్ట్" (ఉజ్వల ఆరంభం) కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజూ ఉదయం విద్యార్థులకు పాలు, సాయి న్యూట్రిషన్ పౌడర్తో చాకోస్ కలిపిన పౌష్టికాహారం ఇస్తారు. పాఠశాల ఆవరణలో కెలాగ్స్ ప్లాంట్ లీడ్ శేఖర్ భోస్లే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా, శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) రమేష్కుమార్, కెలాగ్స్ ప్లాంట్ హెచ్.ఆర్ లీడ్ హరి జయబాలన్, ఇహెచ్ఎస్ లీడ్ సురేష్ బాబు, క్వాలిటీ లీడ్ సుధీర్ పడాల, కెలాగ్స్, శ్రీసిటీ ఫౌండేషన్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శేఖర్ భోస్లే మాట్లాడుతూ, కెలాగ్స్ సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా తమ ఎన్జీఓ భాగస్వామి 'సాయి అన్నపూర్ణ ట్రస్ట్'తో కలసి విద్యార్థుల ఆరోగ్య పరిపుష్టి మరియు డ్రాప్ ఔట్స్ను తగ్గించే ఉద్దేశ్యంతో 'బ్రైట్ స్టార్ట్' కార్యక్రమం వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ఇప్పటికే శ్రీసిటీ పరిధిలోని ఇరుగుళం, మాదనపాలెం ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ప్రారం



భించబడగా, ప్రస్తుతం చెరివిలో మొదలుపెట్టామని చెప్పారు. త్వరలో శ్రీసిటీ పరిసరాల్లోని ఇతర అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కెలాగ్స్ సామాజిక సేవలను శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఒక ప్రకటనలో అభినందించారు. పౌష్టిక అల్పాహారంతో రోజును ప్రారంభించడం ద్వారా విద్యార్థులకు ఇది మంచి ప్రయోజనాన్ని కలుగచేస్తుందని ఆయన అన్నారు. మొత్తంగా 700 మంది విద్యార్థులకు దీని ద్వారా లబ్ధి చేకూరుతున్నట్లు శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్రకుమార్ తెలిపారు.

### జిల్లా పోలీసు అధికారుల సమావేశం

తిరుపతి జిల్లాలోని గూడూరు, నాయుడుపేట, శ్రీసిటీ సబ్ డివిజన్ల పోలీసు అధికారుల సమావేశం ఇటీవల శ్రీసిటీలో జరిగింది. తిరుపతి ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నేరాలు, శాంతిభద్రతలు, విజిలెన్స్పై సమీక్ష నిర్వహించారు. నేర నిరోధక తనిఖీలు నిర్వహిస్తుండాలని, నేరగాళ్ళను అదుపులోకి తీసుకోవాలని, పెండింగ్లో ఉన్న కేసులు, తాజా ఫిర్యాదులు, పెండింగ్ విచారణలు, నాన్బెయిలబుల్ వారెంట్లు, నోటీసులకు సంబంధించిన సమాచారాన్ని సేకరించాలని అధికారులను ఆదేశించారు. వివిధ కేసుల్లో నిందితులుగా ఉన్న వారిపై సకాలంలో కోర్టు ఆదేశాలు అమలయ్యేలా, నోటీసులు అందేలా చూడాలన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలు, అక్రమ మద్యం వ్యాపారం, మాదక ద్రవ్యాల రవాణాకు పాల్పడేవారిపై కఠినచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్ చేయాలని, అవసరమని భావించిన ప్రాంతాలలో బీట్ల పునర్వ్యవస్థీకరణ, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ



సమావేశంలో ఏఎస్పీలు వెంకటరావు(అడ్మిన్), బిహెచ్ విమల కుమారి (నేర విభాగం), డీఎస్పీలు సురేంద్ర రెడ్డి (స్పెషల్ బ్రాంచ్), జగదీష్నాయక్ (శ్రీసిటీ), పలువురు సిఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

### 10వ తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి

శ్రీసిటీ ఫౌండేషన్ ద్వారా శ్రీసిటీ పరిసరాల్లోని ఇరుగుళం, మాదనపాలెం జడ్పీ హైస్కూళ్లలో పదవ తరగతి చదువుకుంటున్న విద్యార్థులకు గురువారం పరీక్షాసామగ్రి పంపిణీ చేశారు. ఏప్రిల్ 3 నుంచి పరీక్షలు ప్రారంభంకానున్న నేపథ్యంలో, పరీక్షలు రాయడం కోసం ఒక్కో విద్యార్థికి ఒక రైటింగ్ ప్యాడ్, రెండు పెన్నులు, జామెంట్రీ బాక్స్ వితరణగా ఫౌండేషన్ ప్రతినిధులు అందచేశారు.

## దంపూరులో రూ.10 లక్షలతో సిమెంట్రోడ్లు

### 'గడప గడపకు' నిధులతో తొలి నిర్మాణం



'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాల అమలుకు కేటాయిస్తున్న నిధులతో, విడవలూరు మండలంలోని దంపూరు మిక్స్డ్ కాలనీ, రామచంద్రాపురం ఎస్టి కాలనీలలో ఇటీవల 10 లక్షల రూపాయలు వెచ్చించి సిమెంటు రోడ్లు వేయడం ప్రజలను ఆకట్టుకుంటోంది. అందులోనూ కోవూరు నియోజకవర్గంలో ఇదే మొట్టమొదటి ప్రారంభోత్సవం కావడంతో పార్టీ కార్యకర్తలు, నాయకులు ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్రెడ్డి పాల్గొని ఈ సిమెంట్ రోడ్లకు ప్రారంభోత్సవం చేశారు.

## 'మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

### నేదురుమల్లి రామ్కుమార్రెడ్డి



మహిళా సాధికారతే తమ ప్రభుత్వ లక్ష్యమని, అందుకోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి నిరంతరం కృషిచేస్తున్నారని రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్మెంట్బోర్డు ఛైర్మన్, వెంకటగిరి నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త నేదురుమల్లి రామ్కుమార్రెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన వైఎస్సార్ ఆసరా 3వ విడత సంబరాల్లో భాగంగా వెంకటగిరిలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారత, ఆర్థిక స్వావలంబన, సుస్థిరమైన ఆర్థికాభివృద్ధిని సాధిస్తోందని, వారి కుటుంబాల సంక్షేమాన్ని కాంక్షిస్తూ ఆసరా పథకం ద్వారా నేరుగా అక్కచెల్లెమ్మల బ్యాంకు ఖాతాల్లోకి మూడో విడత నగదు జమ చేయడం జరుగుతోందని అన్నారు. పాదయాత్రలో జగన్మోహన్రెడ్డి మహిళల ఇబ్బందులను స్వయంగా అర్థంచేసుకుని ఇచ్చిన మాటప్రకారం మడమ తిప్పకుండా నాలుగు విడతల్లో డ్వాక్రా మహిళల బకాయిలను మాఫీ చేస్తూ ప్రవేశపెట్టిన మహత్తర సంక్షేమ పథకమే 'వైఎస్సార్ ఆసరా' అని, వెంకటగిరి నియోజకవర్గంలో వైఎస్సార్ ఆసరా ద్వారా మొదటి విడతలో 4,222 సంఘాలకు రూ. 29.84 కోట్ల లబ్ధిని చేకూర్చినట్లు తెలిపారు.

### ఆసరా'ను సద్వినియోగం చేసుకోండి :

ప్రభుత్వం అందజేస్తున్న 'ఆసరా' పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ డెవలప్మెంట్బోర్డు ఛైర్మన్, వెంకటగిరి నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త నేదురుమల్లి రామ్కుమార్రెడ్డి కోరారు. ఇటీవల ఆయన డక్కిలి మండలంలోని 'వెలుగు' కార్యాలయం ఆవరణలో వైఎస్సార్ ఆసరా మూడో విడత లబ్దిదారుల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తొలుత ఆయన లబ్దిదారులతో కలిసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి వైయస్సార్ ఆసరా అర్హులకు చెక్కు అందజేశారు. అనంతరం స్థానిక నాయకులు రామ్ను ఘనంగా సత్కరించారు.

## పింఛను ఇప్పించండి సారూ!

### విశ్రాంత గ్రంథాలయోద్యోగుల మొర

జిల్లా గ్రంథాలయ సంస్థలో 70 మంది పింఛను పొందుతున్నారు కానీ గత జనవరి, ఫిబ్రవరి నెలల పింఛను ఇంకా రాకపోవడంతో వారి అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. అంతేకాదు, ఆ సంస్థలో పనిచేస్తున్న సిబ్బందికి కూడా జీతాలు సక్రమంగా ఇవ్వడం లేదు. అదేమని అడిగితే నిధులు లేవని సమాధానం. ఈ పరిస్థితిని ప్రభుత్వం గమనించి వెంటనే పింఛన్లు, సిబ్బందికి జీతాలు ఇప్పించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు బి.సుబ్బారెడ్డి, ఎస్. పెంచలయ్య ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలోని పురపాలక సంఘాలు దాదాపు 27 కోట్లకు పైగానే గ్రంథాలయ సెస్సు బకాయిలున్నాయని, ఒక్క నెల్లూరు నగరపాలక సంస్థ నుంచే కోట్లల్లో బకాయిలు పేరుకుపోయి ఉన్నాయని, ఎంతోకాలం నుంచి సెస్సు చెల్లించకపోవడంతో గ్రంథాలయాల నిర్వహణ కష్టంగా ఉందని, ఆ బకాయిలు త్వరగా చెల్లిస్తే తప్ప తమకు మోక్షం లేదని వారు కోరుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు ఈ విషయం పరిశీలించి వెంటనే జిల్లాలోని పురపాలకసంఘాలు వారంతా సెస్సు బకాయిలు చెల్లించేలా ఆదేశాలు జారీచేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

# నెల్లూరు కబుర్లు



## డీకేడబ్ల్యు కాలేజీకి 'న్యాక్' గుర్తింపు

నెల్లూరు నగరంలోని డీకేడబ్ల్యు ప్రభుత్వ మహిళా కళాశాలకు న్యాక్ (నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్–బెంగళూరు) గుర్తింపు లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి. గిరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జాతీయస్థాయిలో కళాశాలకు ఏ-గ్రేడ్ న్యాక్ గుర్తింపు రావడానికి ప్రోత్సహించిన జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబుకి ఆయన ధన్యవాదాలు తెలిపారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థుల సహకారంతో ఈ గుర్తింపు లభించిందని, భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో మరిన్ని అవార్డులు సాధించేందుకు కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.

## రాంజీకి సన్మానం



హైదరాబాద్‌కు చెందిన చంద్రతేజ్ లయ మ్యూజిక్ అకాడమీ వారు నెల్లూరు టౌన్‌హాలులో ఇటీవల జరిగిన కార్యక్రమంలో ప్రముఖ మెజీషియన్, హిప్నాటిస్టు, సమ్మోహన సామ్రాట్ రాంజీని ఘనంగా సత్కరించారు. అమరగాయకుడు పద్మశ్రీ ఘంటసాల, సాలూరు రాజేశ్వరరావు శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ప్రముఖ సినీ నేపథ్యగాయకుడు చంద్రతేజ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తిరుపతి ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ ఎం.రాజకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

### ఇరుకళల అమ్మవారిని దర్శించుకున్న..

## దేవాదాయశాఖ సలహాదారు శ్రీకాంత్



ఆంధ్రప్రదేశ్ దేవాదాయ ధర్మాదాయశాఖ ప్రభుత్వ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్ మార్చి 29న నెల్లూరులో ప్రాముఖ్యత కల్గిన పలు ఆలయాలను సందర్శించారు. నెల్లూరు మూలపేటలోని స్వర్ణాల చెరువు ఒడ్డున కొలువై ఉన్న నెల్లూరు గ్రామదేవత శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఆయన పూజలు చేశారు. మాజీ మంత్రి, నెల్లూరు ఎంపీ, నెల్లూరు రూరల్ వైకాపా ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆలయ నిర్వాహకులు ఆలయ సంప్రదాయాలను పాటిస్తూ, గౌరవ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం శాలువా పూలమాలలతో సత్కరించి దైవప్రసాదాలను అందజేసి, అర్చకుల ఆశీర్వాదాలతో సత్కరించారు. శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయ ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ రావు శ్రీనివాసరావు (ఆర్ఎస్ఆర్), బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు శ్రీధర్, ముప్వ ప్రసాద్, ఆలయ కార్యనిర్వహణాధికారి కుడూరి పెంచలవరప్రసాద్, ఎక్స్ అఫిషియో సభ్యులు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## డిసిసి ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష

కాంగ్రెస్‌పార్టీ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీపై పార్లమెంట్‌లో అనర్హత వేటు వేయడం, రాహుల్‌గాంధీ ఉంటున్న ఇంటిని ఖాళీచేయమని నోటీసు లివ్వడంతో ఆగ్రహించిన కాంగ్రెస్ నాయకులు ఏఐసిసి పిలుపు మేరకు, డిసిసి అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో మార్చి26న నెల్లూరులో సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. నల్లబ్యాడ్జీలు పెట్టుకుని స్థానిక గాంధీబొమ్మ వద్ద దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి ప్రభుత్వాన్ని, ప్రధాని నరేంద్రమోడీ విధానాలపై విమర్శలు గుప్పించారు. జిల్లా కాంగ్రెస్ నాయకులు సురేష్‌బాబు, మోహన్‌రెడ్డి, ఫయాజ్, వెంకట్రావు, రాజేష్‌రెడ్డి, మహేష్, పప్పర్తి గణేష్‌బాబు, రామకృష్ణ, నాయకురాళ్ళు లతారెడ్డి, మానస, మంజుల తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయిలో కెవిఎన్ఆర్ విద్యార్థిని ప్రతిభ



ఇటీవల జరిగిన ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్–కం మెరిట్ స్కాలర్షిప్) పరీక్షల్లో నెల్లూరు కెవిఎన్ఆర్ నగరపాలక ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని ఎస్.చరిణి రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానం సాధించి తన ప్రతిభను చాటుకుంది. ఈ సందర్భంగా డిఇఒ గంగాభవాని, అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ సిహెచ్. ఉషారాణి ఆ విద్యార్థినిని అభినందించారు. కెవిఎన్ఆర్ పాఠశాల ఉపాధ్యాయులకు ఆదర్శం కావాలన్నారు. విద్యార్థులను ప్రతిభతో తీర్చి దిద్దుతున్న ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ్‌ప్రకాష్‌ను, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులను కూడా అభినందించారు.

### త్యాగరాజస్వామి మందిరంలో..

## శ్రీరామనవమి ఉత్సవాలు

నెల్లూరులోని వేదాయపాలెంలో ఉన్న శ్రీ సద్గురు త్యాగరాజస్వామి మందిరంలో మార్చి 29 నుంచి ఏప్రిల్ 4వ తేది వరకు శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు, సద్గురు శ్రీ షిరిడీ సాయినాథుని జన్మదినోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. భక్తులందరూ తరలివచ్చి ఈ వేడుకల్లో పాల్గొనాలని వారు కోరారు.


## సమాచార పౌరసంబంధ శాఖ డీడీ బదిలీ

జిల్లా సమాచార పౌరసంబంధ శాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర ప్రసాద్ బదిలీ అయ్యారు. ఆయన్ను మచిలీపట్నం డీడీగా బదిలీ చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులిచ్చింది. ఈ స్థానంలో విజయవాడలో ప్రస్తుతం సెలవులో ఉన్న సదారావు నెల్లూరుజిల్లా డీడీగా నియమితులయ్యారు.

## మార్చి 31న ఐఏబి సమావేశం

జిల్లా సాగునీటి సలహామండలి (ఐఏబి) సమావేశం మార్చి 31 శుక్రవారం ఉదయం 10.30 గంటలకు నెల్లూరులోని కొత్త జడ్పీ హాల్‌లో జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు అధ్యక్షతన జరుగుతుందని, సోమశిల ప్రాజెక్టు నుంచి రెండోపంటకు తాగునీరు కేటాయించే విషయమై చర్చిస్తారని నీటిపారుదలశాఖ ఇంజనీర్ కృష్ణమోహన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## 'తంగిరాల మహాభారతం' 48వ భాగం




స్వయంవరం మొదలవుతుంది, ద్రౌపదిని ఎలాగైనా చేపట్టాలనే కోరికతో ఒక్కొక్క మహారాజు వచ్చి ధనుస్సు ఎత్తటానికి ప్రయత్నించి, ఎత్తలేక పడిపోతారు. కొందరు మహారాజులు ధనుస్సును ఎత్తుతారు కానీ, విల్లు నారిని కట్టలేకపోతున్నారు. అందరికి తెలిసిపోయింది ఇదంత సులువుకాదని, మనకెందుకులే ఈ భంగపాటు అని మాట్లాడకుండా కూర్చుంటారు. కొంతమంది అనుకుంటారు... ఈ విల్లు ఎక్కుపెట్టినా మత్స్య యంత్రాన్ని కొట్టలేమని ప్రయత్నం కూడా చేయరు. శ్రీకృష్ణుని ఆదేశం మేరకు యాదవ తదితర వంశాల వీరులు తటస్థంగా ఉండిపోతారు. మహావీరులైన కర్ణ, శల్య, జరాసంధ, శిశుపాలురు ధనుస్సుని ఎక్కుపెట్టలేకపోతారు. అందరు క్షత్రియ వీరులు అయిపోయారు.

అప్పుడు ధర్మరాజు అర్జునుని చూసి సౌజ్ఞ చేసి మత్స్య యంత్రాన్ని కొట్టమని కళ్ళతో ఆదేశించాడు. అర్జునుడు లేచి వెళుతున్నప్పుడు, కొంతమంది బ్రాహ్మణులు హేళన చేస్తారు, కొంతమంది ఆశీర్వదిస్తారు. మత్స్యయంత్రం దగ్గరకు వెళ్లి ధనుస్సుకి నమస్కరించి ఒక క్షణంలో ఎక్కుపెట్టి 5 బాణాలతో పడగొడతాడు. సభాస్థలంలో ఉన్న ప్రేక్షకులు అబ్బురపడి జయజయ ధ్వనులు చేస్తారు. వీడు పరమేశ్వరుడో, ఇంద్రుడో, సూర్యభగవానుడో ఇలా బ్రాహ్మణ రూపంలో వచ్చి సునాయాసంగా మత్స్య యంత్రాన్ని ఛేదించాడని అనుకుంటారు. ద్రౌపది అర్జునుని మెడలో పూలహారం వేస్తుంది. కానీ క్షత్రియ మహారాజులకి కోపం వచ్చి ఇంతమంది క్షత్రియులుండగా ఎవరో అనామకుడికి ద్రౌపదిని కట్టబెడుతున్నాడని. ద్రుపదుడు మీదకు వెళ్ళినప్పుడు ఆయన భయపడి బ్రాహ్మణుల వెనుక దాక్కుంటాడు. ఆయనకి బాసటగా బ్రాహ్మణులు నిలబడతారు.

భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది.
పూర్తి నిడివి కోసం
Syam Tangirala Mahabharatam @YouTubeలో చూడగలరు.






## మురళీమోహన్‌రాజుకు ఉగాది పురస్కారం



'సృజన' సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో నెల్లూరు టౌన్ హాల్‌లో ఇటీవల సామాజిక సేవకులకు ఉగాది పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. యువకవి, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.మురళీమోహన్‌రాజు గత 16 సంవత్సరాలుగా చేస్తున్న సాహిత్య, సాంస్కృతిక, సేవారంగాలకు చేస్తున్న సేవలను అభినందిస్తూ ఏపీ జెన్‌కో డిఎస్పీ కొల్లూరి శ్రీనివాసరావు, కృష్ణపట్నం సర్కిల్ ఇన్స్పెక్టర్ కె.వేమారెడ్డి, శ్రీరామరాజు చారిటబుల్ ట్రస్టు ఛైర్మెన్ పేర్నపాటి శ్రీరామరాజు చేతుల మీదుగా ఉగాది పురస్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు దగ్గుపాటి రాధాకృష్ణ, డాక్టర్ లలిత షిర్డీష తదితరులు పాల్గొన్నారు.

## పొన్నాల వెంకటశేషారెడ్డికి..



ప్రముఖ పౌరాణిక రంగస్థల కళాకారుడు.. 'హరిశ్చంద్ర ఫేమ్', నెల్లూరు రూరల్, పొట్టేపాళెం నివాసి పొన్నాల వెంకటశేషారెడ్డికి ఇటీవల ఉగాదిని పురస్కరించుకుని నెల్లూరు రోటరీక్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో ఉగాది పురస్కారాన్ని బహూకరించారు. జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా వెంకటశేషారెడ్డి నటనా కౌశల్యాన్ని, ప్రత్యేకించి పౌరాణిక నాటకరంగానికి ఆయనందిస్తున్న సేవలను అందరూ అభినందించారు.

## జడ్పీలో కారుణ్య నియామకాలు

నెల్లూరు జిల్లాపరిషత్‌లో ఇటీవల కారుణ్య నియామకాలు జరిగాయి. జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జడ్పీ సిఇఓ చిరంజీవి పలువురికి నియామక పత్రాలు అందజేశారు. సింగరవేలు, మేరీగోల్డ్ అనే వారిని కోవూరులోని ఎంపీడీఓ కార్యాలయం, అనుమాల ఇందిరను బుచ్చిరెడ్డిపాళెం జడ్పీ బాలికోన్నత పాఠశాలలో, మల్లారపు పద్మను విడవలూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్స్‌గా నియమించారు.



# నూతన ఆవిష్కరణలపై దృష్టిపెట్టాలి

## విద్యార్థులకు సతీష్‌రెడ్డి పిలుపు

విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలని డిఆర్‌డిఓ మాజీ ఛైర్మెన్, కేంద్ర రక్షణశాఖ సాంకేతిక సలహాదారు, ప్రముఖ శాస్త్రవేత్త, మన నెల్లూరీయుడు డాక్టర్ గుండ్రా సతీష్‌రెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన తిరుపతిలోని కరకంబాడి రోడ్డులో ఉన్న శ్రీ వేంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. దేశ అభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర కీలకమైనదని, విద్యార్థులు సృజనాత్మకశక్తితో, సాంకేతిక నైపుణ్యంతో రాణించి సమాజాభ్యున్నతికి దోహదం చేయాలని అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో 'ఆత్మనిర్భర్ భారత్' ద్వారా దేశం అనేక రంగాల్లో ముందుకు పయనిస్తోందని, సాంకేతికరంగంలో మరింత పురోగతి సాధిస్తోందని అన్నారు. ముఖ్యంగా దేశ రక్షణ రంగంలో సాంకేతికతను దిగుమతి చేసుకునే స్థాయి నుంచి మన దేశం ఎగుమతి చేసేంత స్థాయికి ఎదిగిందని సంతోషం వ్యక్తం చేశారు. స్వదేశీ పరిజ్ఞానంతో 'వందేభారత్' రైళ్లను తయారు చేయడం అద్భుతమని, మన ఇంజనీర్ల ప్రతిభాపాటవాలకు అదొక నిదర్శనమని ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్‌వి యూనివర్శిటీ ప్రొఫెసర్ వైవి రామిరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐసిఇ ఛైర్మెన్ అంబవరపు గంగిరెడ్డి, వైస్ ఛైర్మెన్ ప్రకాష్, ప్రదీప్, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ.సుధాకర్‌రెడ్డి, అధ్యాపకులు డా.శ్రీనివాసులురెడ్డితో పాటు పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# అంబరాన్నంటిన సంబరం

## నింగిలోకి విజయవంతంగా దూసుకుపోయిన ఎల్‌విఎం3-ఎం3 రాకెట్

- కక్ష్యలోకి 36 ఉపగ్రహాలు
- ఇస్రోకి మరో వాణిజ్య విజయం



***భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో అద్భుత విజయాన్ని సాధించింది. మార్చి 26న ప్రయోగించిన ఎల్‌విఎం-3 ఎం-3 రాకెట్ నిప్పులు చిమ్ముకుంటూ నింగికెగసింది. నిర్దేశిత అంతరిక్ష కక్షలోకి చేరి, 36 ఉపగ్రహాలను సలక్షణంగా విడిచిపెట్టింది. ఇదెంతో చరిత్రాత్మకం. భారత్‌కు గర్వకారణం కూడా. షార్ నుంచి ప్రయోగించిన ఈ వాణిజ్యపరమైన రాకెట్ విజయంతో షార్ శాస్త్రవేత్తల్లో సంతోషం వెల్లువెత్తింది. ఒకేసారి 36 ఉపగ్రహాలను విజయవంతంగా కక్షలోకి చేర్చడంతో భారత శాస్త్రవేత్తల ప్రతిభాపాటవాలు మరోసారి ప్రపంచవ్యాప్తంగా అందరి ప్రశంసలు అందుకుంటున్నాయి. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఛైర్మెన్ డా.ఎస్ సోమనాథ్ పర్యవేక్షణలో ఈ వాణిజ్య రాకెట్ ప్రయోగం దిగ్విజయమైంది.***

అందరూ అనుకున్నట్లుగానే మన బాహుబలి రాకెట్ గురితప్పని రామబాణంలా దూసుకుపోయింది. అంతరిక్ష రంగంలో తిరుగులేని శక్తిగా అవతరించిన ఇస్రో కీర్తికిరీటంలో మరో ఆణిముత్యం పొదిగినట్లయింది. వాణిజ్య రాకెట్ల ప్రయోగాల్లోనూ భారత్ తన సత్తా చాటుకుంటోంది. ఆదివారం ఉదయం సరిగ్గా 9 గంటలా 20 సెకన్లకు శ్రీహరికోటలోని 2వ లాంచ్‌ప్యాడ్ నుంచి ఎల్‌విఎం-3 ఎం-3 పేరుతో ప్రయోగించిన జిఎస్‌ఎల్‌వి మార్క్ రాకెట్ ప్రయోగం విజయవంతం కావడంతో అంతరిక్ష ప్రయోగాల్లో భారత్ మరో మైలురాయిని అధిగమించినట్లయింది. బ్రిటన్‌కు చెందిన నెట్‌వర్క్ యాక్సెస్ అసోసియేట్ లిమిటెడ్, వన్‌వెబ్ సంస్థలకు చెందిన 36 సమాచార ఉపగ్రహాలను ఈ రాకెట్ మోసుకుపోయి భూమికి 450 కిలోమీటర్ల ఎత్తులో నిర్ణయించిన అంతరిక్ష కక్షకు చేర్చింది. ఒక్కో విడతగా నాలుగు ఉపగ్రహాల వంతున 9 విడతలుగా అంతరిక్ష కక్షలో ప్రవేశపెట్టారు. ఈ ఉపగ్రహాల బరువు 5,805 కిలోలు. గతంలో వన్‌వెబ్ ఇండియా-1 పేరుతో 2022 అక్టోబర్ 23వ తేదీన కూడా షార్ నుంచి 36 ఉపగ్రహాలను విజయవంతంగా ప్రయోగించడం తెలిసిందే. ఈ రాకెట్ విజయాలతో ఇస్రోకి వాణిజ్యపరమైన ప్రయోజనాలకు ఎంతో బలం చేకూరినట్లయింది. ఇదేవిధంగా, ఇదే స్ఫూర్తితో ఏప్రిల్‌లో సింగపూర్‌కు చెందిన ఉపగ్రహాన్ని కూడా అంతరిక్షంలోకి చేర్చనున్నట్లు ఈ సందర్భంగా ఇస్రో ఛైర్మెన్ సోమనాథ్ చెప్పారు. ఈ ఏడాది చంద్రయాన్-3, ఆదిత్య-ఎల్1తో పాటు మరో నాలుగు ప్రయోగాలు కూడా నిర్వహించేందుకు కృషి జరుగుతోందన్నారు.




# పుణ్య సంస్మరణ



మాన్యుడు, మరపురాని నేత

## శ్రీ సోమిరెడ్డి రాజగోపాలరెడ్డి గారు

కీర్తిశేషులై ఏప్రిల్ 6వ తేదీకి 40 సంవత్సరాలు గడవనున్న సందర్భంగా
ఆ పుణ్యమూర్తిని స్మరిస్తూ...

వారి పవిత్రాత్మకు భక్త్యంజలి ఘటిస్తున్నాము.

కుమారులు: సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి
మాజీ మంత్రివర్యులు, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు

లేట్ సోమిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

కుమార్తెలు - అల్లుళ్ళు
కట్టంరెడ్డి రాణీసంయుక్త - రాధాకృష్ణారెడ్డి
కేతిరెడ్డి ఉషారాణి - రామకోటారెడ్డి

| మనుమలు | - | మనుమరాండ్రు | మునిమనుమలు | మునిమనుమరాండ్రు |
|---|---|---|---|---|
| సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి | - | శ్రుతి | యల్లా శర్విన్ | యల్లా సంజన |
| డా॥ సోమిరెడ్డి అర్జున్‌రెడ్డి | - | డా॥ లక్ష్మీ ఐషిత | కేతిరెడ్డి శ్రీమన్ | సోమిరెడ్డి శివాని |
| సన్నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి | - | నీలిమ | నిమ్మ ధీర్ | కేతిరెడ్డి శ్రితిక |
| నిమ్మ కౌశిక్‌రెడ్డి | - | డా॥ సింధు | కేతిరెడ్డి శ్రీవంత్ | కట్టంరెడ్డి శ్రీశాన్వి |
| యల్లా సనత్‌రెడ్డి | - | షాలిని | సన్నారెడ్డి రాయల్ భార్గవ్ | కట్టంరెడ్డి హవిష |
| డా॥ కేతిరెడ్డి కళాధర్‌రెడ్డి | | | నిమ్మ నరేన్ | సన్నారెడ్డి నిరుక్తలేఖ |
| కేతిరెడ్డి శశిధర్‌రెడ్డి | - | కీర్తి | సోమిరెడ్డి రణదేవ్ | సోమిరెడ్డి అమైరా |
| కట్టంరెడ్డి విక్రమ్‌రెడ్డి | - | స్నిగ్ధ | సోమిరెడ్డి ఆగస్త్య | |

## బయోగ్యాస్ ప్లాంట్‌లపై...
# పార్లమెంట్‌లో విపిఆర్ ప్రశ్నలు



మధ్యప్రదేశ్ తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో అత్యధిక బయోగ్యాస్ ప్లాంట్లు ఉన్నాయన్న విషయం వాస్తవమేనా? అలా అయితే, మరిన్ని బయోగ్యాస్ ప్లాంట్‌ల ఏర్పాటుకు కేంద్ర మంత్రిత్వ శాఖ చేపట్టవలసిన పథకాల వివరాలు, ముఖ్యంగా గ్రామీణ ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి 2023-24లో కేటాయించిన బడ్జెట్ వివరాలు తెలపండని మార్చి 28న పార్లమెంట్‌లో రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్) అడిగారు. అందుకు స్పందించిన కేంద్రమంత్రి ఆర్.కె.సింగ్ సమాధానమిస్తూ, మధ్యప్రదేశ్ తర్వాత ఆంధ్ర ప్రదేశ్‌లో అత్యధిక బయోగ్యాస్ ప్లాంట్లు ఉన్నాయన్న విషయం వాస్తవం కాదన్నారు. మహారాష్ట్రలో అత్యధిక సంఖ్యలో బయోగ్యాస్ ప్లాంట్లు ఏర్పాటయ్యాయని, తదుపరి కర్ణాటక మరియు ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలలో బయోగ్యాస్ ప్లాంట్లు ఏర్పాటుచేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్రాల నుంచి అందిన సిఫారసుల మేరకు, దేశంలో బయోగ్యాస్ ప్లాంట్‌ల ఏర్పాటుకు న్యూ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ (ఎంఎన్ఆర్ఇ) పథకం కింద కేంద్రం ఆర్థిక సహాయం(సిఎఫ్ఏ) పెంచబడుతుందని వివరించారు.

# రాష్ట్రానికి యూరియా కేటాయింపు ఎంత?
## - రాజ్యసభలో బిఎంఆర్ ప్రశ్న



గత మూడేళ్లలో ఆంధ్రప్రదేశ్ చేసిన యూరియా డిమాండ్ వివరాలేమిటి? డిమాండ్‌కు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్‌కు ఇప్పటి వరకు సరఫరా చేయబడిన యూరియా పరిమాణం ఎంత? రాష్ట్రంలో రైతులకు యూరియా కొరత ఉందా?..వివరాలు తెలపండని మార్చి 28న రాజ్యసభలో సభ్యులైన బీద మస్తాన్‌రావు (బిఎంఆర్) ప్రశ్నించారు. అందుకు కేంద్ర రసాయనాలు మరియు ఎరువుల మంత్రిత్వశాఖలోని రాష్ట్ర మంత్రి భగవంత్ కూబా సమాధానమిస్తూ... ఏపీలో యూరియా సరఫరా మరియు రైతులకు అందుబాటులో ఉన్న యూరియా గడచిన మూడు సంవత్సరములలో తగినంత ఉందన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరాల్లో కూడా యూరియా లభ్యత రైతులకు సరిపడా ఉందని పేర్కొన్నారు. 2021-22లో 17 లక్షల మెట్రిక్ టన్నులు అవసరం కాగా 17.08 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా, అదేవిధంగా 2022-23 వ ఆర్థిక సంవత్సరంలో 22-3-2023వ తేదీ వరకు 16.65 లక్షల మెట్రిక్ టన్నుల అవసరం కాగా 18.13 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు అందుబాటులో ఉందని వివరించారు.

# ఎట్టకేలకు... పాపం పండింది



డా. విజయ్‌కుమార్ (ఫైల్ ఫోటో)

- డాక్టర్ విజయ్‌కుమార్ హత్యకేసులో నిందితులకు జీవితఖైదు
- భార్య, కొడుకుతో సహా అయిదుగురికి యావజ్జీవ శిక్ష
- సంచలన తీర్పునిచ్చిన న్యాయస్థానం

***ఎట్టకేలకు పాపం పండింది. చంపేసి, ఏమీ తెలియనట్లుగా అంత్యక్రియలు చేసేస్తే ఎవరూ కనుక్కోరులే, ఆస్తంతా తమకే వస్తుందిలే అనుకున్న నేరస్తుల ఆట కట్టయింది. నెల్లూరులోనే కాక రాష్ట్రవ్యాప్తంగా పేరెన్నికగన్న ప్రజావైద్యుడు డాక్టర్ జి.విజయకుమార్ (జీవికె)ను పొట్టనపెట్టుకున్న ఆయన భార్య, కొడుకుతో సహా మరో ముగ్గురికి న్యాయస్థానంలో జీవితఖైదు పడింది. డబ్బు కోసం ఎందరో ఎన్నోరకాల నేరాలకు ఒడిగడుతున్న నేటి కాలంలో, భార్యాబిడ్డలే ఇలాంటి ఘాతుకాలకు పాల్పడడం ఘోరం!***

జనవిజ్ఞానవేదిక కన్వీనర్‌గా, నెల్లూరు ఆసుపత్రి వ్యవస్థాపకుడుగా డాక్టర్ జీవికె అందరికీ పరిచితులు. అనునిత్యం పేదల ఆరోగ్యం కోసం తపించేవారు. సారా వ్యతిరేక ఉద్యమం, అక్షరాస్యత ఉద్యమం వంటి ఎన్నో సామాజిక ఉద్యమాలు కూడా నడిపారు. అలాంటి ఓ మంచి డాక్టర్ కుటుంబసభ్యుల ధనదాహానికి బలైపోవడం దారుణం. ఆస్తి కోసం చివరికి భార్యాబిడ్డలే ఆయన్ను హత్యచేయడం కంటే ఘోరం ఇంకెక్కడుంటుంది?.. కట్టుకున్న భార్య, కన్న బిడ్డ, ఒక న్యాయవాది, ఇద్దరు కిరాయి హంతకులతో కలసి 2015 మే 28వతేది అర్ధరాత్రి వేదాయపాళెంలోని నివాసంలో ఉన్న డాక్టర్ విజయకుమార్‌ను అత్యంత అమానుషంగా గొంతు పిసికి చంపేశారు. ఆదమరచి నిద్రపోతుండగా గొంతునులిమి ఊపిరాడకుండా చేసి హత్య చేశారు. ఇంతకన్నా నమ్మకద్రోహం ఏముంటుంది?..

ఈ కేసు అప్పట్లో పెద్ద సంచలనం రేపింది. పాపపు డబ్బుకోసం సమాజంలో ఒక బాధ్యతాయుతమైన వైద్యుడిని హతమార్చిన నేరానికి, ఆ నేరస్తుల జీవితాలు జైలు పాలయ్యాయి. నేరం రుజువు కావడంతో నెల్లూరు మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి సత్యవాణి మార్చి 24న హంతకులు అయిదుగురికీ యావజ్జీవ శిక్ష విధిస్తూ సంచలనాత్మక తీర్పుచెప్పారు. డాక్టర్ విజయకుమార్ భార్య ఉషారాణి, కుమారుడు సుందరయ్య, న్యాయవాది కునిశెట్టి శ్రీధర్‌తో పాటు, కిరాయి హంతకులు మీసాల గంగరాజు, పామంజి పోలురాజులకు జీవితఖైదుతో పాటు వివిధ సెక్షన్ల కింద ఒక్కొక్కరికి 5వేల రూపాయల వంతున జరిమానా కూడా విధించింది న్యాయస్థానం. సుదీర్ఘ విచారణ అనంతరం నేరస్తులకు శిక్ష పడడంతో ప్రజాసంఘాలు, సామాజిక ఉద్యమ కార్యకర్తలు, ఆయన అభిమానులు న్యాయస్థానం తీర్పుపట్ల సంతోషం వ్యక్తం చేశారు.

# సామాజిక సేవలో ఎస్‌బిఐ

కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అనే కార్యక్రమం కింద అంగన్ వాడీలను అభివృద్ధి చేయడానికి బాధ్యత తీసుకున్నామని ఇటీవల స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) అధికారులు ప్రకటించారు. గొల్లపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎస్‌బిఐ అమరావతి సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ నవీన్‌చంద్ర ఝా పాల్గొని స్మార్ట్ టీవీ, టాబ్, కబోర్డులు, ఆర్ఓ వాటర్‌ప్యూరిఫయ్యర్ వంటి వాటిని అంగన్‌వాడీ కేంద్రానికి అందజేశారు. ఇదేవిధంగా ఎస్‌బిఐ ప్రతి రీజనల్ కార్యాలయం నుంచి 34 అంగన్‌వాడీ కేంద్రాలను 38 లక్షల రూపాయలతో ఆధునీకరించడానికి అవసరమైన వస్తుసామగ్రినంతా సమకూరుస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బిఐ తిరుపతి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఆర్.వరదరాజన్, నెల్లూరు ఎస్‌బిఐ రీజనల్ మేనేజర్ శ్రీనివాసరావు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# తిరుపతి జిల్లా గూడూరు డివిజన్



గూడూరు రూరల్ మండలంలోని ఈదరపల్లి గ్రామంలో శ్రీరాములవారి గుడి ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్.

# ముత్యాలమ్మకు వెండి కిరీటం



చిల్లకూరు మండలంలోని తూర్పు కనుపూరు శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి జాతర సందర్భంగా దాతల ద్వారా 1కేజీ 228 గ్రాముల వెండి కిరీటం, కర్ణపత్రాలను శ్రీ పోలేరమ్మ అమ్మవారి దేవస్థాన మాజీఛైర్మన్ వేమారెడ్డి మురళీమోహన్‌రెడ్డి ముత్యాలమ్మ అమ్మవారి దేవస్థానానికి కానుకగా సమర్పించారని ముత్యాలమ్మ దేవస్థాన కార్యనిర్వహణాధికారి కె.నవీన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

# కల్యాణ వీరభద్రుడికి పూజలు

త్యాగరాజవీధిలోని శ్రీ కల్యాణ వీరభద్రస్వామి దేవస్థానంలో మార్చి 28న ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకాలు, అర్చనలు, అష్టోత్తర శతనామావళి పూజలు వైభవంగా చేపట్టారు. స్వచ్ఛాంధ్ర రాష్ట్ర ఛైర్‌పర్సన్ పొణకా దేవసేనమ్మ, పారిశ్రామికవేత్త పొణకా శివకుమార్‌రెడ్డిల దాతృత్వంతో అన్నదానం నిర్వహించారు.

# వృద్ధుల సంరక్షణకు చర్యలు
## - ఆర్డీవో కిరణ్‌కుమార్



తల్లిదండ్రులు, వయోవృద్ధుల సంరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చట్టాలు ఉన్నాయని ఆర్డీవో కిరణ్‌కుమార్ తెలిపారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వయోవృద్ధుల చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని మార్చి 28వ తేదీన నిర్వహించారు. వృద్ధులు ఏవైనా సమస్యలు ఉంటే హెల్ప్‌లైన్ 14567ని సంప్రదించాలన్నారు.

## రోటరీ కోస్టల్‌జోన్‌కు
# అసిస్టెంట్ గవర్నర్‌గా మయూరి శ్యాంయాదవ్



గూడూరు రోటరీ కోస్టల్ జోన్‌కు అసిస్టెంట్ గవర్నర్‌గా 2023-24 సంవత్సరానికి మయూరి శ్యాంయాదవ్‌కు అవకాశం కల్పించారు. డిస్ట్రిక్ట్ గవర్నర్ మానిక్ పవార్ వారికి, కోస్టల్ జోన్‌లో ఉన్న రొటేరియన్స్ అందరికీ ఆయన ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. మయూరి శ్యాం మాట్లాడుతూ కోస్టల్ జోన్‌లోని రోటరీ క్లబ్స్ అయిన గూడూరు రోటరీ మెయిన్ క్లబ్, నాయుడుపేట రోటరీ క్లబ్, సూళ్ళూరుపేట మరియు కోట రోటరీక్లబ్‌లో ఉన్న ప్రతి రోటరీ సభ్యుల సలహాలు, సూచనలు తీసుకొని తద్వారా ఆయా ప్రాంతాలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.



# ముత్యాలమ్మ ఆలయానికి కొత్త ట్రస్టుబోర్డు

తూర్పుకనుపూరు ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ ట్రస్టుబోర్డు ప్రమాణస్వీకారం మార్చి 26వ తేదీ ఆలయ ప్రాంగణంలో జరిగింది. నూతన ఛైర్‌పర్సన్‌గా సిద్దారెడ్డి ఇంద్రసేనారెడ్డి, ట్రస్టీలుగా చేవూరు శ్రీనివాసులు, చిల్లకూరు వెంకటేశ్వర్లమ్మ, యల్లసిరి పుష్పలత, దువ్వూరు సాయికృష్ణారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఉప్పల ప్రభాకర్, పర్వతాల విమల, బాలు బాలాజీ, ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా చాకిరి రమణయ్యల చేత ఈవో కొమ్మలపూడి నవీన్‌కుమార్ ప్రమాణం చేయించారు. పెంచలకోన ఆలయ ఈవో కోవూరు జనార్ధన్‌రెడ్డి, పలువురు వైకాపా నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు రోటరీవెస్ట్ పలసరుకులు



రోటరీ క్లబ్ గూడూర్ వెస్ట్ ఆధ్వర్యంలో ఇటీవల గూడూరులో దివ్యాంగుల భరోసా కార్యక్రమం జరిగింది. ప్రాస్పర్ స్కూల్ అధినేత బుస్సారెడ్డి దశరథరామిరెడ్డి వారి వదిన బుస్సారెడ్డి కుంతలమ్మ జ్ఞాపకార్థం 16 మంది దివ్యాంగులకు నెలకు సరిపడా పలసరుకులు ఇవ్వడం జరిగింది. రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ ధనంజయరెడ్డి, సభ్యులు బొమ్మిడి శ్రీనివాస్, వాసుగౌడ్, శేగు శ్రీనివాసులు, హరిప్రశాంత్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, సూర్య ఫ్యాన్సీ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

# పేదలకు మెరుగైన వైద్యసేవలు



పేదలకు మెరుగైన వైద్యసేవలు సకాలంలో అందించడమే లక్ష్యంగా వైద్యరంగానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తూ విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతోందని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు పేర్కొన్నారు. మార్చి 27న నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో జిల్లాకు నూతనంగా మంజూరైన ఏడు 104అంబులెన్స్‌లను జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలకు అత్యవసరమైన, నాణ్యమైన ఉచిత వైద్య సేవలు అందించేందుకు 104, 108 వాహనాలు ఉపయోగపడుతున్నాయని, ప్రధానంగా గ్రామీణ ప్రజలకు ఆ సేవలు సకాలంలో అందుతున్నాయన్నారు. ఆనం అరుణమ్మ మాట్లాడుతూ, మారుమూల గ్రామాలకు సైతం మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ముఖ్యమంత్రి జగన్ కృషి చేస్తున్నారని, జిల్లాలో 104 వాహనాలు సేవలందిస్తుండగా, తాజాగా మరో ఏడు నూతన వాహనాలను జిల్లాకు కేటాయించడంపట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఆమె ధన్యవాదాలు తెలిపారు. జిల్లా వైద్యాధికారి పెంచలయ్య, జడ్పీ సీఇవో చిరంజీవి, 104, 108అంబులెన్స్‌ల జిల్లా మేనేజర్ పవన్ పాల్గొన్నారు.

## మానవ రోబోలు!

వాళ్ళు రోబోలు
ప్రాణమున్న రోబోలు
రోజులు చాలని రోబోలు
హృదయం లేని రోబోలు
అయితే ఈ రోబోలు బ్రతకడానికి
కరెంటు తీగల ఛార్జింగ్ అవసరం లేదు.
కేవలం రిమోట్‌తో పనిచేస్తాయి.
బ్రతుకును చంపేసుకొని
బంధాల్ని తెంపేసుకొని
బాకీల లెఖ్ఖల్ని మడిచిపెట్టుకొని
పని చేసే ఆధునిక రోబోలివి.
ఉదయం క్యూ కడితే చాలు
సాయంత్రం వరకు పనితప్ప
వేరే ధ్యాస లేని మానవ రోబోలివి
ఏ నిరుద్యోగ భూతం పూనిందో
బ్రతుకుదామన్న చిగురు ఆశ రగిలిందో
మానవులుగా బ్రతకాలన్న ఆలోచన
లేనేలేని అధునాతన యంత్రాలివి
కాళ్ళను నిమ్మళంగా
భూమిలోకి పాతేసుకొని
రోజంతా కంట్రోల్ కమాండ్
స్వీకరించే నిర్వీర్యత ఓ వైపు -
కేవలం ఉద్యోగించడానికే జీవితాల్లో
యాంత్రికత రగిలించే శాపగ్రస్తత
మరోవైపు - రీఛార్జింగ్ లేక
కాసింత విశ్రాంత గ్రస్తత కానరాక
విముక్తికై పరితపిస్తున్న
సమయం ఆసన్నమైంది.
ఆధునిక యంత్ర శాస్త్రం నిర్వచించని
మనిషిని కృంగదీసే పండుటాకుల
పరంపరలో... కాలం గతిలో
ధరణీతలం అంతా సమరగర్జాభూతమై
రేపును నిట్టనిలువులుగా కృంగదీసే దీనమ్ములు
జన్మనెత్తిన ప్రతి ప్రాణి ఈ రోబో ఇజానికి
వ్యతిరేకంగా విప్లవోన్ముఖమై
పోరాడాల్సిన అగత్యం వచ్చేసింది.
లేకుంటే, లేదంటే ఈ మానవ
రోబోల అశక్తతా నిస్సత్తువతో లోకాలు
కళావిహీనమయిపోతాయి
కార్పొరేట్ కుతంత్రాలకు భావిభారతం
విచ్ఛిన్నమయిపోతుంది
రేపు అనే చీకటిరోజు
ఉదయించబోతుంది!



**చిన్ని నారాయణరావు**
94402 02942

# ఏకోపాధ్యాయ స్కూళ్లలో టీచర్లను పెంచుతారా?

## - పార్లమెంట్‌లో ప్రశ్నించిన ఎంపీ ఆదాల



దేశవ్యాప్తంగా ఉన్న 1.2 లక్షల ఏకోపాధ్యాయ స్కూళ్లలో టీచర్ల సంఖ్యను పెంచుతారా? అని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సోమవారం పార్లమెంట్లో ప్రశ్నించారు. ఆ స్కూళ్లకు ఆర్థికంగా నిధులు కేటాయించే ప్రతిపాదన ఏమైనా ఉందా?.. అని కూడా అడిగారు. కేంద్ర విద్యా శాఖ ఉప మంత్రి అన్నపూర్ణాదేవి దీనికి రాతపూర్వకంగా సమాధానం ఇస్తూ, అన్ని రాష్ట్రాలు ఇచ్చిన సమాచారాన్ని సేకరించే ఒక వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. విద్యా అంశం ఉమ్మడి జాబితాలో ఉందని, వీటి నిర్వహణ, పర్యవేక్షణ కేంద్ర, రాష్ట్రాలపై ఉందని పేర్కొన్నారు. ఆయా రాష్ట్రాల నుంచి అందిన సమాచారాన్ని బట్టి, ఆయా పాఠశాలలకు నిధులను విడుదల చేస్తామని, ఉపాధ్యాయుల నియామకం అనేది నిరంతర ప్రక్రియ అని తెలిపారు.

## కోవిడ్‌పై అధ్యయనంతో తీసుకున్న చర్యలేమిటి?

కోవిడ్-19 మహమారిపై నిర్వహించిన సమగ్ర అధ్యయనంతో ఎటువంటి చర్యలు తీసుకున్నారని?..ఆదాల ప్రశ్నించారు. ఈ ప్రతికూల ఆర్థిక ప్రభావాన్ని పరిష్కరించడానికి ప్రభుత్వం ఏదైనా ప్రపంచ సహాయం తీసుకుందా? అని కూడా అడిగారు. అందుకు, కేంద్ర ఆర్థిక శాఖ ఉప మంత్రి పంకజ్ చౌదరి రాతపూర్వకంగా సమాధానం ఇస్తూ కోవిడ్-19 మహమ్మారి ప్రభావంపై ప్రభుత్వం ఎప్పటికప్పుడు అంచనా వేస్తోందని తెలిపారు. అందులో భాగంగానే భారీ టీకా కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు గుర్తుచేశారు. గత మూడు బడ్జెట్లలో ఆర్థిక వ్యవస్థను ఉద్దీపనం చేసేందుకు మూలధన వ్యయాన్ని 30-35శాతం పెంచినట్లు తెలిపారు. అలాగే రాష్ట్రాలకు కూడా గణనీయమైన సహాయాన్ని అందించినట్లు పేర్కొన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు క్రెడిట్ లింక్ గ్యారెంటీ స్కీమ్‌ను ప్రారంభించామని, 'ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన' ద్వారా పేదలు, వృద్ధులు, వితంతువులకు సబ్సిడీపై ఆహార ధాన్యాలను అందించినట్లు తెలిపారు. ప్రపంచ సహాయాన్ని పొంది, మరెన్నో ఉపశమన చర్యలను తీసుకున్నట్లు పేర్కొన్నారు.

# 'న్యాక్' గుర్తింపు దిశగా విఎస్‌యు



నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం 'న్యాక్' (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్) గుర్తింపు కోసం స్వీయ అధ్యయన నివేదిక (సెల్ఫ్ స్టడీ రిపోర్ట్)ను విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య జి.ఎం.సుందరవల్లి ప్రతిపాదనలు పంపించడం జరిగిందని అంతర్గత నాణ్యత హామీ సెల్ డైరెక్టర్ ఆచార్య అందే ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఉపకులపతి మాట్లాడుతూ, విశ్వవిద్యాలయం యుజిసి గుర్తింపు పొందిన తరువాత, పురోగతిని సాధించే క్రమంగా తాము న్యాక్ అక్రిడిటేషన్ కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. న్యాక్ గుర్తింపు కోసం పనిచేసిన రిజిస్ట్రార్ ఆచార్య పి.రామచంద్రారెడ్డి, ఆచార్య అందే ప్రసాద్, అసిస్టెంట్ డైరెక్టర్ డా. సిహెచ్.వెంకట్రాయులు, డా ఎం.ఉస్సేనయ్యలకు, బోధన, బోధనేతర సిబ్బందికి వీసీ తన ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

# ఫ్రెండ్స్ వాకర్స్.. షష్టిపూర్తి వేడుకలు



నెల్లూరులోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత శోభకృత్ నామ సంవత్సరంలో పుట్టిన షేక్ నజీర్ అహమ్మద్, గణపర్తి వెంకటేశ్వర్లునాయుడు, ఆర్‌విఆర్ మోహన్‌రాజు, కిలారి శ్రీనివాసులునాయుడు, జి.వెంకయ్యలను ఘనంగా సత్కరించారు. అదేవిధంగా మార్చి నెలలో జన్మించిన ఏవి సుబ్బరాజు, బి.శ్రీమన్నారాయణ, పరుచూరి స్వామిదాస్‌లను కూడా శాలువలతో సన్మానించారు. వాకర్స్ సంఘం రీజనల్ కోఆర్డినేటర్ ఏకొల్లు రాఘవరెడ్డి, 2022 వాకర్స్ ఇంటర్నేషనల్ ట్రెజరర్ నలుబోలు బలరామయ్యనాయుడు, అధ్యక్షులు హరిబాబు, కార్యదర్శి రామ మోహన్‌రెడ్డి, హరినారాయణరెడ్డి, సదానందరెడ్డి, వెంకటరమణ, పిచ్చయ్య, మాగంటి ప్రసాద్, చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

# మనుబోలమ్మకు..వెండి శఠారి బహూకరణ



మండలకేంద్రమైన మనుబోలులో గ్రామదేవత శ్రీ మనుబోలమ్మ అమ్మవారికి స్థానిక భక్తులు బదుగు రవీంద్ర -భవాని దంపతులు ఈనెల 26న సుమారు 30వేల రూపాయల విలువ జేసే వెండి శఠారిని బహూకరించారు. ఆలయ అర్చకులు ఫణీంద్రశర్మ మనుబోలమ్మ, నాగవరపమ్మ దేవతలకు ప్రత్యేకపూజలు చేసి, దాతలను ఆశీర్వదించారు.

# టూకీగా...

## జొన్నవాడ కామాక్షమ్మ.. హుండీ ఆదాయం 52.56 లక్షలు

జొన్నవాడ కామాక్షమ్మ అమ్మవారి దేవాలయంలో మార్చి 28న హుండీలను లెక్కించగా భక్తులు సమర్పించిన కానుకల ద్వారా సుమారు 52.56లక్షల రూపాయల ఆదాయం వచ్చింది. దేవాదాయశాఖ అధికారి పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు టి.నందకుమార్, ముంగర శివకుమార్, బ్యాంక్ మేనేజర్ కెవిఎన్‌బి సింగ్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నార్త్ రాజుపాళెంలో పేదలకు అన్నదానం

కొడవలూరు మండలం నార్త్ రాజుపాళెం గ్రామంలోని వినాయక కాలనీలో మార్చి 28న స్థానిక 'ఆర్ యూత్ ఫౌండేషన్' వారి ఆధ్వర్యంలో దాదాపు 500 మంది నిరుపేదలకు అన్నదానం చేశారు. అనంతరం పేదలకు బియ్యం పంపిణీ చేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పి.ఏడుకొండలు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

## సంగం ఆరోగ్యకేంద్రం తనిఖీ

మండల కేంద్రమైన సంగంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మార్చి28న జిల్లా వైద్యాధికారి డాక్టర్ పెంచలయ్య ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. కోవిడ్ కేసుల పట్ల వైద్యాధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆరోగ్య కేంద్రం డాక్టర్ ప్రతిమ పాల్గొన్నారు.

## బండేపల్లిలో విద్యుత్‌షాక్‌తో రైతు కన్నుమూత

మనుబోలు మండలంలోని బండేపల్లి గ్రామంలో మార్చి 28వ తేది మధ్యాహ్నం కరెంట్‌షాక్ తగిలి మేకల సుబ్రహ్మణ్యం అనే రైతు కన్నుమూశాడు. ఆయన వయసు 70 సంవత్సరాలు. భార్య, ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. పొలంలో పనిచేసుకునేందుకు వెళ్ళగా, ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్ తగిలి చనిపోయినట్లు కుటుంబసభ్యుల సమాచారం.

## కొండబిట్రగుంటలో బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య

బోగోలు మండలం కొండబిట్రగుంటలో మార్చి 28న రావి వెంకటేశ్వర్లు అనే వ్యక్తి బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే అంత పరిస్థితి ఎందుకు వచ్చిందనే విషయమై వివరాలు తెలియలేదు. ఈ ఆత్మహత్య విషయమై పోలీసులకు కూడా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలుస్తోంది.

## చంద్రశేఖరపురంలో పాముకాటుకు మహిళ మృతి

అల్లూరు మండలం తూర్పుగోగులపల్లి పరిధిలోని చంద్రశేఖరపురంలో మార్చి28న పురిణి శేషమ్మ(57) పాముకాటుకు గురై మృతిచెందింది. ఇంటిదగ్గర పరిసరాలు శుభ్రం చేస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. భర్త గతంలో చనిపోయారు. ఆమె చెల్లెలి ఫిర్యాదుతో అల్లూరు ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## పెద్దిరెడ్డిపల్లిలో విద్యాసామగ్రి పంపిణీ

వరికుంటపాడు మండలం పెద్దిరెడ్డిపల్లి పాఠశాలలో మార్చి28న టెన్త్ విద్యార్థులకు జామెంట్రీబాక్సులు వగైరా విద్యాసామగ్రిని అందజేశారు. పూర్వవిద్యార్థుల వితరణతో జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎల్ఇ నారాయణ పూర్వవిద్యార్థుల ఔదార్యాన్ని అభినందించారు.

## కుల్లూరులో 'పోషణ్ పక్వాడా'

కలువాయి మండలం కుల్లూరు అంగన్‌వాడీ కేంద్రంలో మార్చి 28న 'పోషణ్ పక్వాడా' కార్యక్రమం నిర్వహించి బాలింతలు, తల్లులకు బాలామృతం అందజేశారు. ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారికి వివరించారు. అంగన్‌వాడీ సెక్టార్ సూపర్‌వైజర్ రాజేశ్వరమ్మ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సునీల పాల్గొన్నారు.

## సౌత్ ఆములూరులో ఉచిత వైద్యశిబిరం

తోటపల్లిగూడూరు మండలం సౌత్‌ఆములూరు గ్రామంలో మార్చి 28న ఏనెల్ స్పెషాలిటీ ఆసుపత్రి వారు ఉచిత వైద్య శిబిరం నిర్వహించి సుమారు 250 మందికి బీపీ, షుగర్, మోకాళ్ళనొప్పులు, కిడ్నీ, గుండె పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీచేశారు. మద్దిన గోపాల్‌నాయుడు తదితర టిడిపి నాయకులతో పాటు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

# సమాజ హితం కోసమే సాహిత్యం

## 'నెరసం' సభలో వక్తలు

సమాజ హితాన్ని ఆకాంక్షించి రచనలు చేయడమే సాహిత్య లక్షణమని, సమాజాభ్యుదయం కోసం కవులు పాటుపడాలని వక్తలు చెప్పారు. మార్చి 26న నెల్లూరు టౌన్‌హాలులో నెల్లూరు జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో జాతీయస్థాయి ఉగాది కవి సమ్మేళనం, ఉగాది పురస్కారాల సభ జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి కవులు, రచయితలు ఈ సభలో పాల్గొన్నారు. మల్కాజ్‌గిరి స్పెషల్ కలెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి ముఖ్యఅతిథిగా



పాల్గొని మాట్లాడుతూ, సాహిత్యంలో నెల్లూరుసీమ ప్రత్యేకత సంతరించుకుందని, మహాకవి తిక్కన వంటి ప్రాచీనకవులతో పాటు ఆధునిక కాలంలో కవికోకిల దువ్వూరు రామిరెడ్డి, బెజవాడ గోపాలరెడ్డి, పఠాభి, ఆచార్య ఆత్రేయ వంటి ఎందరో సాహితీ మూర్తులకు ఈ సీమ పుట్టినిల్లని కొనియాడారు. నేటి కవులు కూడా సామాజిక రుగ్మతలపై స్పందించి, సమాజాన్ని జాగృతం చేయాలని కోరారు. అనంతరం శోభకృత్ నామ సంవత్సర ఉగాది పురస్కారాలను అందజేశారు. నెల్లూరుకు చెందిన ప్రముఖ నవలా రచయిత్రి సోమిరెడ్డి జయప్రదకు 'నెల్లూరుసీమ తొలి నవలా రచయిత్రి'గా బిరుదును ప్రదానం చేశారు. గుంటూరుకు చెందిన కవి భూసురపల్లి వెంకటేశ్వర్లుకు ఉగాది పురస్కారం అందజేశారు. నెల్లూరు పద్యకళా పరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్‌ను 'పద్య కళానిధి' బిరుదుతో సత్కరించారు. ప్రముఖ కవులు చిన్ని నారాయణరావు, కలిమిశ్రీ, ప్రకాష్, శాంతికృష్ణ, విల్సన్, రాధాకృష్ణ తదితరులకు నెరసం సాహిత్యసేవా పురస్కారాలను ప్రదానం చేశారు. ఉదయం నుంచి రాత్రి దాకా నిర్వహించిన కవి సమ్మేళనంలో పెద్దసంఖ్యలో కవులు, కవయిత్రులు పాల్గొన్నారు. ప్రముఖ రచయిత అశోక్‌కుమార్ రచించిన దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జీవితచరిత్రను ఈ వేదికపై ఆవిష్కరించారు. నెరసం అధ్యక్ష కార్యదర్శులు ఏ.జయప్రకాష్, పాతూరు అన్నపూర్ణతో పాటు ప్రముఖులు సిహెచ్ పెంచలరెడ్డి, వాకాటి విజయకుమార్‌రెడ్డి, చలంచర్ల భాస్కర్‌రెడ్డి, నలుబోలు బలరామయ్యనాయుడు, కోడూరు హరినారాయణరెడ్డి, ప్రకాశం–కృష్ణా జిల్లాల రచయితల సంఘాల అధ్యక్షులు పొన్నూరు వేంకట శ్రీనివాసులు, పూర్ణచందు, అంకమరావు, అరుణ, విద్యాధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



### కవులు, కవయిత్రులకు.. 'లాయర్' పుస్తక బహుమతి :

నెరసం సభ సందర్భంగా నెల్లూరులోని 'లాయర్' వారపత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ సభకు వచ్చిన కవులు, కవయిత్రులందరికీ 'లాయర్' పత్రిక తరఫున పుస్తక బహుమతిని అందజేశారు. డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి స్వీయచరిత్ర, లాయర్ ప్రచురించిన 'సింహపురి సీమకు వన్నె తెచ్చిన వనితలు', నెల్లూరు సీమ కవుల కవితల సంపుటి, ప్రముఖ రచయిత బోగాది వెంకటరాయుడు 'లాయర్'లో రచించిన 'మనలోమాట' తదితర పుస్తకాలను సాహిత్యాభిమానులకు కానుకగా ఇచ్చారు. తొలుత ఈ పుస్తకాలను సభలో ముఖ్యఅతిథులు ఆవిష్కరించి, అందరికీ ఉగాది శుభాకాంక్షలు చెప్పి, ఈ పుస్తకాలను బహుకరించారు. 'లాయర్' సాహితీసేవను వక్తలు కొనియాడారు. ప్రపంచ తెలుగు సమాఖ్య ప్రాంతీయ అధ్యక్షులు నలుబోలు బలరామయ్యనాయుడు, సాహితీవేత్తలు డా. గంగిశెట్టి శివకుమార్, బొగ్గరపు రాధాకృష్ణమూర్తి, 'లాయర్' సబ్ ఎడిటర్ మద్దూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# రాపూరు నేత.. చెన్ను బాలకృష్ణారెడ్డి అస్తమయం

## తరలివచ్చిన రాజకీయ ప్రముఖులు.. అశ్రునయనాలతో అంత్యక్రియలు



***వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ప్రజాసేవకునిగా పేరొందిన నేత, జగమెరిగిన రాజకీయవేత్త, మాజీ ఏఎంసి ఛైర్మెన్, రాపూరు మండల ప్రజాపరిషత్ అధ్యక్షుడు, గోనుపల్లి ఎంపీటీసీ సభ్యుడు చెన్ను బాలకృష్ణారెడ్డి (76) ఇక లేరు. అనారోగ్యంతో ఆయన బెంగుళూరులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ, మార్చి 27వ సోమవారం నాడు తుదిశ్వాస విడిచారు. ఆయన మరణవార్తతో రాపూరు మండలం శోకతప్తమైంది.***



పాడె మోస్తున్న ఎమ్మెల్యే ఆనం, మెట్టుకూరు ధనుంజయరెడ్డి

1947లో జన్మించిన చెన్ను బాలకృష్ణారెడ్డికి విద్యార్థి దశ నుంచి రాజకీయాల పట్ల ఆసక్తి ఉండేది. ప్రజాసేవే పరమావధిగా ఆయన రాజకీయాల్లోకి వచ్చారు. గ్రామసర్పంచ్‌గా, ఆ తర్వాత రాపూరు మండలాధ్యక్షునిగా ఎన్నికై, ఆయన ఆ ప్రాంతానికి ఎనలేని సేవలు చేశారు. పేదలపాలిట పెన్నిధిగా, అజాతశత్రువుగా ఉంటూ, ప్రజల కష్టసుఖాల్లో తోడునీడగా ఉండేవారు. అందుకే, రాపూరు రాజకీయాల్లో ఆయనదే అందెవేసిన చేయిగా ఉండేది. జిల్లాలోని రాజకీయనాయకులే కాక, రాష్ట్రవ్యాప్తంగా అనేకమంది ప్రముఖ నాయకులతో కూడా ఆయనకు ఆత్మీయమైన పరిచయాలుండేవి. అందరితో అభిమానంగా ఉంటూ మంచి నేతగా మంచిపేరు తెచ్చుకున్నారాయన. రాజకీయాలకతీతంగా అన్ని పార్టీల నాయకులతో స్నేహపూర్వకంగా ఉండేవారు. పార్టీ ఏదైనా ప్రజాసేవే ముఖ్యమని భావించే అతికొద్దిమంది రాజకీయవేత్తల్లో ఆయనొకరు. స్వస్థలమైన తానంచర్లకు సర్పంచ్‌గా మొదలైన ఆయన రాజకీయ ప్రస్థానం.. దాదాపు 50ఏళ్ల పాటు నిర్విఘ్నంగా కొనసాగింది. ఆయన మృతితో రాపూరు మండలం పాతతరానికి చెందిన ఒక మంచినేతను కోల్పోయినట్లయింది.

### కన్నీటి నివాళులతో.. అంతిమయాత్ర

చెన్ను పార్థివదేహాన్ని జిల్లావ్యాప్తంగా అనేకమంది ప్రముఖులు, రాజకీయనాయకులు సందర్శించి నివాళులర్పించారు. మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎన్‌డిసిసి బ్యాంక్ మాజీ ఛైర్మెన్, ఉదయగిరి నియోజకవర్గ వైకాపా పరిశీలకుడు మెట్టుకూరు ధనుంజయరెడ్డి తదితరులు అశ్రునయనాలతో ఆయన పాడె మోశారు. భావోద్వేగంతో రామనారాయణరెడ్డి కంట తడి పెడితే, ధనుంజయరెడ్డి ఆయన్ను తలచుకుంటూ పెద్దగా రోదించారు. అశేష ప్రజలు, అభిమానుల మధ్య ఆయన అంత్యక్రియలు చెన్ను చిన్నకుమారుడు అశోక్ కుమార్‌రెడ్డి తానంచర్లలో నిర్వహించారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జడ్పీ ఛైర్ పర్సన్ ఆనం అరుణమ్మ, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మెన్, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చేవూరు దేవ కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, పెంచలకోన దేవాలయం ఛైర్మెన్ చెన్ను తిరుపాల్‌రెడ్డి, పిఏసిఎస్ అధ్యక్షుడు చెన్ను భాస్కర్‌రెడ్డి తదితర ప్రముఖులు కన్నీటి నివాళులర్పించారు.

## రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రికి..

# రూ. 5 లక్షల విరాళం



నెల్లూరు నగరంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ క్యాన్సర్ హాస్పిటల్ నూతన భవన నిర్మాణానికి నెల్లూరు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు యాలమూరి రంగయ్యనాయుడు ఇటీవల 5 లక్షల రూపాయల విరాళాన్ని అందజేశారు. ఆ చెక్కును ఆయన జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబుకు అందజేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ క్యాన్సర్ హాస్పిటల్ నూతన భవనంలో ఒక గదికి తన తల్లిదండ్రులైన దివంగత యాలమూరి రామచంద్రయ్యనాయుడు, యాలమూరి రమణమ్మల పేర్లను వారి జ్ఞాపకార్థంగా నామకరణం చేయాలని ఆయన కోరారు. క్యాన్సర్ హాస్పిటల్ వైద్యులు నాగేశ్వరరావు, సామాజిక కార్యకర్త కె సురేష్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

# నాయకుడు బలం.. పార్టీ బలహీనం

(మొదటి పేజీ తరువాయి)

నేతల దృష్టికి తెచ్చినా కొట్టిపారేస్తున్నారని అంటున్నారు. రాజకీయ అనుభవం, అవగాహన లేని సలహాదారుల వ్యవస్థ వల్లనే తమ పార్టీ బలహీనపడుతోందని అంటున్నారు. ప్రధానంగా ముఖ్య సలహాదారుగా వ్యవహరిస్తున్న వారి వ్యక్తిగత ప్రయోజనాలను బట్టే పార్టీలో నాయకులకు ప్రాముఖ్యత, ప్రాధాన్యత లభిస్తోందని వాపోతున్నారు. అనామకులని, అసమర్థులని తెచ్చి అందలం ఎక్కిస్తున్నారని అంటున్నారు. కఠోర వాస్తవాలను పార్టీ అధ్యక్షుడి దృష్టికి తీసుకుపోగలిగిన సమర్థత, సామర్థ్యం తమకున్నా తమని ఆయన దాకా వెళ్లనీయకుండా ఈ సలహాదారు వ్యవస్థే అడ్డుకుంటోందని ధ్వజమెత్తుతున్నారు. "మేము ముఖ్యమంత్రి దాకా నేరుగా వెళ్లగలిగితే, వీళ్ళ ఆటలు సాగనిస్తామా..? పార్టీని ఇలా అప్రదిష్టపాలు కానిస్తామా..?? మా పార్టీ బాగుంటేనే కదా మా నాయకుడు బాగుంటాడు. ఆయన బాగుంటేనే కదా మేం బాగుంటాం" అని రాయలసీమకు చెందిన ఎమ్మెల్యే ఒకరు కామెంట్ చేయడం గమనార్హం.

మాకు ముఖ్యమంత్రి సమయం ఇవ్వడంలేదు. ఆయనను అద్దాల పంజరంలో పెట్టి, బయట వీళ్ళు ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారు. అప్పుడప్పుడూ ఈ సలహాదారులు మాత్రమే లోపలకి వెళ్ళి బయట అంతా బాగుందని చెప్పి, వాస్తవ పరిస్థితులను దాచిపెడుతున్నారు. జగన్ మెప్పు కోసం పార్టీ భవిష్యత్తును తాకట్టుపెట్టి, తమ పబ్బం గడుపుకుంటున్నారన్నది పార్టీలో సీనియర్ల అభిప్రాయం. రెండవసారి జరిగిన మంత్రివర్గ విస్తరణ ఏ ప్రామాణికంగా చేశారో ఒక్క సలహాదారులకు తప్ప ఇంకెవరికీ తెలియదని విమర్శిస్తున్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని బూచోడిగా అభివర్ణించినవారికి సైతం ఈ సలహాదారులు ఆశీస్సులతో మంత్రి పదవి వరించిందని సీనియర్లు తమ విచారాన్ని వ్యక్తం చేస్తున్నారు.

తాను అనుకున్నది సాధించగలిగిన దమ్ము, ధైర్యం, సత్తా, పట్టుదల ఉన్న నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని, ఆయన అందిస్తున్న సంక్షేమ పథకాలతో అపార జనాదరణ ఆయన సొంతం చేసుకున్నారని, ప్రభుత్వం, నాయకుడు బలంగా ఉన్నా ఈ సలహాదారులు తీసుకుంటున్న అపరిపక్వత, అసమంజస నిర్ణయాలవల్ల పార్టీ బలహీనపడిపోతోందని సీనియర్లతో పాటు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న పార్టీ శ్రేణులు కూడా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పార్టీకే కంచుకోట లాంటి నెల్లూరుజిల్లాలో ముగ్గురు శాసనసభ్యులతో పాటు ఇతర జిల్లాకి చెందిన మరో శాసనసభ్యురాలు కూడా ఇప్పటికే బహిరంగంగానే పార్టీకి దూరమయ్యారు. ఆ నలుగురికి మరో నలుగురు తోడవక ముందే వీలయినంత త్వరలో ముందుగా పార్టీ నాయకత్వాన్ని ప్రక్షాళన చేయాలని పార్టీవర్గాలు అభిప్రాయ పడుతున్నాయి.

### మితిమీరుతున్న ఏంఎల్ఏల ఆగడాలు..!

కొన్ని నియోజకవర్గాలలో శాసనసభ్యుల అరాచకాలు కూడా మితిమీరుతున్నాయని విశ్లేషకులు అంటున్నారు. తమను అడిగే నాథుడే లేదన్నట్లుగా వీరి అవినీతి దందాలు, వసూళ్ల పరంపరలు, దౌర్జన్యాలు, దోపిడీలు కొనసాగుతున్నాయి. వీరి సొంత లాభం కోసం తమ పార్టీ సానుభూతిపరులను ఇబ్బందిపెట్టడానికి కూడా వెనుకాడడం లేదు. అధికారపార్టీలో ఉన్నారు కాబట్టి, పోలీసు వ్యవస్థ కూడా ఈ నేతలకే కొమ్ము కాస్తుండడంతో ఆ ప్రభావం నేరుగా పార్టీపైనే పడుతోంది. పార్టీ సానుభూతిపరులని, రాజశేఖరరెడ్డి కుటుంబం కోసం ప్రాణాలను సైతం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్న ఆ కుటుంబ అభిమానులను ఈ నయా నేతలు ఇబ్బందులకు గురిచేస్తున్నారన్న ఆరోపణలు చాలాచోట్ల వినపడుతున్నాయంటున్నారు విశ్లేషకులు. వీటన్నిటికీ ఒకటే పరిష్కారం అంటూ... సామాన్యులకు సైతం సీఎం సమయాన్ని కేటాయిస్తే తప్ప నిజాలు బయటకి రావని అంటున్నారు. కనీసం ఎన్నికలు దగ్గర అవుతున్న తరుణంలోనైనా జగన్‌మోహన్‌రెడ్డి తనా మనా తెలుసుకుని సమయం ఇస్తే తప్ప పార్టీ మళ్ళీ గాడినపడే అవకాశాలు లేవని సూచిస్తున్నారు.

# ఎన్‌బికెఆర్‌లో ఉత్సాహంగా మెకోస్డియా వేడుకలు

విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్‌లో ఇటీవల మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో మెకోస్డియా-2023 వేడుకలు జరిగాయి. రాష్ట్రంలోని వివిధ ఇంజనీరింగ్ కళాశాలల నుంచే కాక, చెన్నై నుంచి కూడా విద్యార్థులు 350 మంది దాకా పాల్గొన్నారు. వివిధ విభాగాలకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు కళాశాల డైరెక్టర్ డా.వి.విజయకుమార్‌రెడ్డి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా 'కిసాన్ డ్రోన్' ప్రదర్శన, కెయుజి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (చెన్నై) విద్యార్థులు పలు అంశాలపై నిర్వహించిన 'రిమోట్ కంట్రోల్డ్



ఎయిర్‌క్రాఫ్ట్' ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. పత్ర సమర్పణలో మునిశ్యామ్, నిఖిత్, వైష్ణవి, క్విజ్‌లో మహేష్, దినేష్, సురేష్‌లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందుకున్నారు. ప్రాజెక్టు విభాగంలో చెన్నై విద్యార్థులతో పాటు నెల్లూరులోని నారాయణ ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారు. విభాగాధిపతి డా.సిహెచ్ ఆర్ విక్రమ్‌కుమార్, డా.వై.అశోక్‌కుమార్‌రెడ్డి, డా.బి.అమర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## 12న జాతీయ సదస్సు



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఏప్రిల్ 12వ తేదీన సైన్స్ అండ్ హ్యుమానిటీస్ విభాగం ఆధ్వర్యంలో 'సృజన 2కె23' జాతీయస్థాయి సదస్సును నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ డా.వి.విజయకుమార్‌రెడ్డి తెలిపారు. మార్చి 28న అందుకు సంబంధించిన గోడపత్రికలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సదస్సుకు రాష్ట్రం నుంచే కాక, తమిళనాడు, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల్లోని ఇంజనీరింగ్ విద్యార్థులు అనేకమంది పాల్గొంటారని పేర్కొన్నారు. ఇంజనీరింగ్‌లో గణిత, భౌతికశాస్త్రాలకు సంబంధించిన అనేక అంశాల అధ్యయనం గురించి విద్యార్థులు వ్యాసాలను సమర్పిస్తారని, ఉత్తమ వ్యాసాలకు బహుమతులుంటాయని వివరించారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి డా.సి.రవీంద్రరెడ్డి, సదస్సు కన్వీనర్ డా.ఎం ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీలో ఏం జరుగుతోంది!?



ఎన్నికలకు మరో ఏడాదికిపైగా సమయం ఉన్నప్పటికీ, ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు మాంచి రసకందాయంలో పడినట్టు కనపడుతున్నాయి.

కేవలం పరస్పర ఆరోపణలతో పరమ రొటీన్‌గా, నిస్సారంగా తయారైన రాజకీయాలకు... 'పట్టభద్రుల కోటా నుంచి ఎంఎల్‌సీ ఎన్నికలు' ఓ కిక్ ఇచ్చాయి. ఎన్నికలు జరిగిన మూడు స్థానాలలోనూ అనూహ్యంగా టీడీపీ అభ్యర్థులు గెలిచారు. చంద్రబాబు-టీడీపీ కార్యాలయంలో నేతలకు స్వీట్లు తినిపించారు. పండుగ చేసుకున్నారు.

ఆ సందడి చల్లారకముందే, ఎంఎల్‌ఏల నుంచి ఎంఎల్సీ కోటా ఎన్నికలు వచ్చాయి. వైసీపీ నాయకత్వం ఈ ఎన్నికలపై... ముందు పెద్దగా దృష్టిపెట్టలేదు. 154 మంది సభ్యుల మద్దతు ఉంది కదా, ఇబ్బంది ఏముందిలే అని వైసీపీ పెద్దలు భావించారు. నిజానికి నిజమైతే, అంతే! కానీ సభ్యుల్లో కొంత అసంతృప్తి ఉందనే విషయాన్ని పెద్దగా పట్టించుకోలేదు.

ఎంత అసంతృప్తి ఉన్నా... క్రాస్ ఓటింగ్‌కు వెళ్లేంత సాహసం చేస్తారా? అనే భావం కావచ్చు, కొంత ఉదాసీనంగానే వైసీపీ నాయకత్వం వ్యవహరించిందనే చెప్పాలి. కానీ, ఇది రాజకీయం. అడ్డం తిరిగేవరకే, వినయం.. విధేయత. అడ్డం తిరగాలి అని ఒకసారి డిసైడ్ అయిపోతే, ఇక వారి మాట వారే వినరు. పెద్దా లేదు, చిన్నా లేదు.

ఈ ఎన్నికల్లో జరిగిన క్రాస్ ఓటింగ్, రాజకీయ గమనాన్ని ఏకంగా ఓ మలుపే తిప్పింది. స్తబ్దుగా పడి ఉన్న 'రాజకీయం' అనే శతఘ్నికి వెనుకనుంచి నాటు మందుగుండు బాగా దట్టించి, చంద్రబాబునాయుడు నిశ్శబ్దంగా ఓ అగ్గిపుల్ల గీచి వదిలారు. దీంతో, అది భీకర శబ్దంతో సూటిగా దూసుకెళ్లి, వైసీపీని తాకింది. అసెంబ్లీ నుంచి కౌన్సిల్‌కు జరగాల్సిన ఎన్నికలకు ముఖ్యమంత్రి జగన్ ఏడుగురు అభ్యర్థులను నిలబెట్టారు. చంద్రబాబు ఒకరిని నిలబెట్టారు. అయితే, వైసీపీ నుంచి ఆరుగురే గెలిచారు. ఏడో అభ్యర్థి ఓడిపోయారు. తెలుగుదేశం నిలబెట్టిన అభ్యర్థి గెలిచారు. నలుగురు వైసీపీ ఎంఎల్‌ఏలు టీడీపీ అభ్యర్థికి ఓట్ వేస్తేనే టీడీపీ అభ్యర్థి గెలిచారు. అందులో రహస్యం ఏమీ లేదు. కానీ, ఎవరా నలుగురు అనే విషయంలోనే వైసీపీ రాజకీయంగా ఇరుకునపడింది.

ఈ 'తిరుగుబాటు' ఘటనను వైసీపీ నాయకత్వం సైతం కొంచెం గుంభనగా.... లౌక్యంగా హ్యాండిల్ చేసి ఉండాల్సింది అని పరిశీలకులు అంటున్నారు. నిజానికి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి పోలింగ్ జరిగిన 23వ తేదీ సాయంత్రం ఈ క్రాస్ ఓటింగ్‌పై మొదటిసారి స్పందించినప్పుడు, లౌక్యంగానే వ్యవహరించారు. క్రాస్ ఓటింగ్‌కు పాల్పడింది ఎవరో తెలుసని, అయితే ఎప్పుడు ఎలా స్పందించాలో అలా పార్టీ స్పందిస్తుందని ఆయన అన్నారు. రాజకీయాల్లో అప్పటికప్పుడు స్పందించడం కుదరదు కదా అని కూడా ఆయన అన్నారు. అది సరైన స్ట్రాటజీ అని కూడా అనిపించింది. ఆయన స్పందనలో రాజకీయ పరిణతి కనపడింది.

వైసీపీ అక్కడితో ఆగి ఉంటే... 'ఆ నలుగురు సైకలాజికల్'గా బాగా ఇబ్బంది పడుతూ ఉండేవారు. సూటిపోటి మాటల్లో, వారితో వైసీపీవారు మైండ్‌గేమ్ ఆడుకునేవారు. కానీ, 24గంటలు గడవకముందే సజ్జల మళ్ళీ మీడియా ముందుకువచ్చి.. క్రాస్ ఓటింగ్ చేశారంటూ ఓ నలుగురి పేర్లు చెప్పారు.

నిజానికి అది సీక్రెట్ పోలింగ్. క్రాస్ ఓట్ అనే ప్రశ్నే తలెత్తదు. పేరుకే 'విప్' జారీ చేశారు. అది రహస్య పోలింగ్ కావడంతో 'విప్'కు చట్టబద్ధత ఉండదు(చట్ట సభల్లో సభ్యులు చేతుల ఎత్తడం ద్వారా తమ ఆమోదాన్ని/తిరస్కారాన్ని వ్యక్తం చేయవలసి ఉన్న సందర్భాల్లోనే 'విప్'కు చట్టబద్ధత ఉంటుంది. విప్‌కు భిన్నంగా చేయి ఎత్తితేనే, క్రాస్ ఓటింగ్‌కు పాల్పడినట్టు). కనుక, సజ్జల వెల్లడించిన నాలుగు పేర్ల గలవారు 'క్రాస్ ఓటింగ్'కు పాల్పడినట్టు సాధికారికంగా ఎవరూ చెప్పడం కుదరదు. అయినప్పటికీ, ఆ నలుగురినీ సస్పెండ్ చేస్తున్నట్టు సజ్జల ప్రకటించి... నిశ్శబ్దంగా ఉన్న 'అసమ్మతి' తేనెతుట్టెను బలంగా కదిలించారు.

అంతే! ఇన్నాళ్ళు మౌనంగా ఉన్న ఆ 'ముగ్గురూ', తాడికొండ ఎంఎల్‌ఏ ఉండవల్లి శ్రీదేవి ఒక్కసారిగా తిరగబడ్డారు. ఆనం రామానారాయణరెడ్డి అయితే పనిలోపనిగా... సజ్జల రామకృష్ణారెడ్డిపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. రామకృష్ణారెడ్డి మూలాల్లోకి సైతం వెళ్లిపోయారు. ఏకంగా ఓ డజను ప్రశ్నలు సంధించారు. ఉండవల్లి శ్రీదేవి (తాడికొండ ఎంఎల్‌ఏ), మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అయితే... ఇక, చెప్పే పనే లేదన్నట్టుగా చెలరేగిపోయారు.

చిత్రం ఏమిటంటే... నెల్లూరు పెద్దారెడ్లు ముగ్గురూ 'రెడ్డి' సామాజికవర్గానికి చెందినవారే. రాజకీయంగా కాకలు తీరిన నేతలు. తోటి 'రెడ్డి' అయిన సజ్జలపై విరుచుకుపడ్డారు. అంటే, ఎక్కడైనా బావ గానీ, రాజకీయం దగ్గర కాదు అని వీరు తేల్చి చెప్పారు.

వీరు అడుగుతున్నది ఒకే ఒక ప్రశ్న. 'మేము క్రాస్ ఓటింగ్ చేసినట్టు ఎలా చెప్పారు? మీరు చూశారా? ఎవరు చెప్పారు?'

ఈ ప్రశ్నకు సమాధానం చెప్పడం అంత సులభం కాదు. ఇది సీక్రెట్ పోలింగ్. ఎవరు ఎవరికి ఓట్






వేశారో, తెలుస్తున్నప్పటికీ ఎవరూ సాధికారికంగా చెప్పడం కుదరదు. చివరకు, భారత ఎన్నికల సంఘం కూడా చెప్పలేదు.

నలుగురు 'క్రాస్ ఓటింగ్'కు పాల్పడ్డారు కనుక, ఇతర అసంతృప్తి వాదులకు ఒక హెచ్చరికగా ఉంటుందనే భావనతో కావచ్చు, వీరిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలి అని అనుకుంటే... 'పార్టీ వ్యతిరేక' కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే కారణం చూపి, 'సస్పెండ్ చేస్తున్నాం' అని చెప్పి ఉంటే... పేచీ ఉండేది కాదు. వాళ్ళు డిఫెన్స్‌లో పడిపోయి ఉండేవారు.

కానీ, స్ట్రెయిట్‌గా క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ్డారు అనడంతో.... వారు నలుగురూ 'అఫెన్స్'లోకి వెళ్ళిపోయారు.

ఇప్పుడు, రాజోలు ఎంఎల్‌ఏ రాపాక వరప్రసాద్ కూడా రంగంలోకి దిగి, క్రాస్ ఓటింగ్ కోసం తనకు 10కోట్లు ఆఫర్ చేశారంటూ మీడియాతో మాట్లాడారు. సాంకేతికంగా(అసెంబ్లీ రికార్డ్స్ ప్రకారం) ఆయన జనసేన సభ్యుడే. 'సిగ్గు... శరం...' వదలడం ఇష్టం లేక, ఆ ఆఫర్‌ను తిరస్కరించినట్టు ఆయన చెప్పారు. తరువాత కొంత మాట మార్చినట్టు వార్తలు వచ్చాయి. ఆయన, ఈ ఘటనను పోలింగ్‌కు ముందు వెల్లడించి ఉన్నట్టయితే... బాంబులాగా పేలి ఉండేది.

ఈ మొత్తం రాజకీయ పరిణామాలను చంద్రబాబునాయుడు బాగా ఎంజాయ్ చేస్తున్నారనే చెప్పాలి.

కేవలం 19 స్థానాలు మాత్రమే నికరంగా కలిగి ఉండి, 23 ఓట్లు తెచ్చుకోవడం మామూలు విషయం కాదు. 'టీడీపీ రాజకీయం' ముందు, 'వైసీపీ రాజకీయం' ఈ ఎన్నికల వరకు తేలిపోయిందనే చెప్పాలి.

దీనికి, ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు హోదాలో... సర్వం తానే అయి వ్యవహరిస్తున్నట్టుగా కనపడుతున్న సజ్జల రామకృష్ణారెడ్డి వైపే బహిష్కృతనేతలు వేళ్ళు చూపెడుతున్నారు అని చెప్పడానికి, 'గ్రేట్ ఆంధ్ర' అనే వెబ్‌సైట్‌లో ప్రచురించిన ఒక కథనాన్ని ఉదాహరణగా చెప్పవచ్చు.

మొన్న 26వ తేదీ ఆదివారం నాడు 'వైసీపీ సస్పెండ్ చేయాల్సింది ఎంఎల్‌ఏల నేనా?' పేరిట ఒక కథనాన్ని ఇచ్చింది. ప్రధాన సలహాదారే ఈ పరిస్థితికి కారణం అంటూ, సుమారు 40 మంది ఎంఎల్‌ఏలు ఇబ్బంది పడుతున్నారని రాసింది. ప్రధాన సలహాదారులనే మార్చాలి అనే అర్థం వచ్చేటట్టు రాశారు.

'గ్రేట్ ఆంధ్ర' అంటే... నూటికి నూరు శాతం జగన్ అనుకూల వెబ్‌సైట్ అని పాఠకులు అనుకుంటుంటారు. ఈనాడు, ఆంధ్రజ్యోతికి తక్కువ కాని రేంజ్‌లో దీనికి పాఠకులు ఉన్నారు.

ఈ రకంగా వివిధ కోణాల నుంచి సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శలు ఎదుర్కొనడం... చివరకు ఏ రాజకీయ పరిణామాలకు దారితీస్తుందనేది అర్థం కావడం లేదు.

కాంగ్రెస్‌ను వదిలి, వైసీపీని స్థాపించిన నాటి నుంచి జగన్‌కు సజ్జల తలలో నాలుకలా వ్యవహరిస్తూ వచ్చారు. దీని కోసమే, 'సాక్షి' ఎడిటోరియల్ డైరెక్టర్ బాధ్యతల నుంచి కూడా తప్పుకుని, జగన్ రాజకీయ కార్యదర్శిగా వ్యవహరిస్తూ వచ్చారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక, ప్రభుత్వ సలహాదారుగా సజ్జల అత్యంత కీలకంగా వ్యవహరిస్తూ వస్తున్నారు.

సస్పెండ్ అయిన ఎంఎల్‌ఏలు గానీ, సోషల్ మీడియాగానీ సజ్జలపై విమర్శలు చేయడం అంటే... ఒక రకంగా ముఖ్యమంత్రి జగన్‌పై చేయడమే అని పరిశీలకులు అంటున్నారు.

ఈ ఎంఎల్సీ ఎన్నికలకు సంబంధించిన ఎపిసోడ్‌లో.... వైసీపీ గమనంలోకి తీసుకోవలసిన అంశాలు కొన్ని ఉన్నాయి.

- వైసీపీకి సంబంధించి ఏ ఎంఎల్సీ, ఎంఎల్‌ఏని తక్కువ అంచనా వేయకూడదు. వాళ్ళు కూడా 'ఆ నలుగురు' బాటలోనే చెలరేగిపోతారు.
- వైసీపీ నేతలు... తమకు అవసరం అనుకున్నప్పుడు, ముఖ్యమంత్రిని కలిసి కష్టం, సుఖం చెప్పుకునే వెసులుబాటు ఉండాలి.
- చంద్రబాబునాయుడును చాలా క్యాజువల్‌గా విమర్శించడం వల్ల, జనంలో ఏమీ మైలేజ్ రావడం లేదనే విషయాన్ని వైసీపీ నేతలు గమనించాలి. చంద్రబాబు రాజకీయాన్ని అర్థం చేసుకోవడం కొంచెం కష్టం. చంద్రబాబు రాజకీయాన్ని విమర్శించే స్థాయి, రాజకీయ అనుభవం కలిగిన నేతలు వైసీపీలో చాలాచాలా పరిమితంగా ఉన్నారని పూర్వపు డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఆ మాట నిజమే అయ్యే పక్షంలో... సజ్జల మీదనే భారం అంతా ఉంది.

అందుకే, ఆయన వైసీపీ సోషల్ మీడియాకు నేతృత్వం వహిస్తున్న ఆయన కుమారుడు భార్గవరెడ్డి వైసీపీని ఎటు తీసుకు వెళతారోనని వైసీపీ నేతలు కొందరు ఆందోళన చెందుతున్నారు. ఆయనకు బదులు ఎవరు ఆ స్థానంలో ఉన్నా... అటువంటి విమర్శలు అతి సహజం. ఆ 'పొజిషన్ పరిస్థితి' అలాంటిది.

తెరవెనుక పాత్రకే ఆయన పరిమితమై, తెరముందు పాత్రకు ఏ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డో.. వైవీ సుబ్బారెడ్డో, బొత్స సత్యనారాయణ లాంటి జగన్ నమ్మకస్తులను ఎంపికచేస్తే.... సజ్జలకు కొంత భారం తగ్గుతుంది. ఆమేరకు వైసీపీకి నష్టం సైతం కొంత తగ్గుతుంది.

- భోగాది వేంకట రాయుడు
bhogadirayudu2152@gmail.com

# సీతారామన్‌తో జగన్ భేటీ

## 'ఉపాధి హామీ' బకాయిలు 2,500 కోట్లు మంజూరుకు వినతి



కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో ఆంధ్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మార్చి 30వ తేది గురువారం న్యూఢిల్లీలో భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై కేంద్ర మంత్రితో సిఎం చర్చించారు. ఉపాధిహామీ పనులకు సంబంధించి రాష్ట్రానికి ఇవ్వాల్సిన బకాయిలు సుమారు రూ. 2,500 కోట్లు ఉన్నాయని, వెంటనే ఆ డబ్బు మంజూరుచేయాలని కోరారు. రాష్ట్రంలో ప్రస్తుత ప్రభుత్వం తప్పులేకున్నా, రుణాలపై కేంద్రం ఆంక్షలు విధించడం సరికాదని సిఎం వివరించారు. పోలవరం ప్రాజెక్టును వేగవంతం చేయడానికి అడహాక్‌గా రూ. 10 వేల కోట్లు మంజూరు చేయాలని, పోలవరం ప్రాజెక్టు కోసం రాష్ట్రప్రభుత్వం సొంతంగా ఖర్చుచేసిన రూ. 2600.74 కోట్ల రూపాయలను సత్వరమే రీయింబర్స్ చేయాలని విజ్ఞప్తిచేశారు. రాష్ట్ర విభజన సమయంలో ప్రత్యేక హోదా ఇస్తామంటూ పార్లమెంటు సాక్షిగా కేంద్రం హామీఇచ్చిందని, ఇకనైనా రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇవ్వాలని కోరారు.

# వాడవాడలా.. కన్నులపండువగా 'శ్రీరామనవమి'



శ్రీరామనవమి సందర్భంగా మార్చి 30న జిల్లావ్యాప్తంగా వాడ వాడలో రామాలయాలు పండుగశోభతో కళకళలాడాయి. వాడవాడలా సీతారామచంద్రులకు ప్రత్యేక పూజలు, ఉత్సవాలు జరిగాయి. విద్యుత్ అలంకరణలతో ఆలయాలు దేదీప్యమానమయ్యాయి. నెల్లూరు నగరంలోని శబరి శ్రీరామక్షేత్రంలో స్వామివారికి విశేష పూజలు, చెంతనే ఉన్న శ్రీరామకోటి స్తూపం ప్రాంగణంలో సీతారాముల కల్యాణోత్సవం కన్నులపండువగా జరిగాయి. పెద్దసంఖ్యలో భక్తులు ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు. రంగనాయకులపేటలోని శ్రీదేవ భూదేవి సమేత శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవాలయం ప్రాంగణంలో సీతారామచంద్రస్వామికి తిరుమంజనం, సీతారాముల కల్యాణోత్సవం, హనుమంతసేవ తదితర ఉత్సవాలు వేడుకగా జరిగాయి. అదేవిధంగా బాలాజీనగర్‌లోని అనంతకోదండరామస్వామి ఆలయంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలతో పాటు, వేదపండితులు మాచవోలు కోటేశ్వరశర్మ ఆధ్వర్యంలో పుత్రకామేష్టి యాగం నయనమనోహరంగా జరిగింది. వివిధ రాష్ట్రాల నుంచి 180మందికిపైగా దంపతులు ఈ యాగంలో పాల్గొన్నారు. అదేవిధంగా బాలాజీనగర్ శివారుల్లోని అద్దాల మందిరంలో సాయినాథునికి విశేష పూజలు, సీతారామచంద్రుల కల్యాణోత్సవం వైభవంగా జరిగాయి.

# కోలాహలంగా సోమిరెడ్డి పుట్టినరోజు వేడుకలు



తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మార్చి 26న ఆయన స్వస్థలమైన నెల్లూరు సమీపంలోని అల్లీపురం గ్రామంలో సంబరాలు అంబరాన్నంటాయి. పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పూలమాలలు, గజమాలలు, బొకేలతో వచ్చి సోమిరెడ్డికి ఆత్మీయంగా జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. కేక్‌లు కట్ చేయించి అందరికీ ఇస్తూ ఆనందం పంచుకున్నారు. దీంతో సోమిరెడ్డి నివాసం అభిమానజనంతో క్రిక్కిరిసిపోయింది. వచ్చినవారందరినీ సోమిరెడ్డి ఎంతో ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తనకు ఆశీస్సులు అందజేసిన అందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని నాయకులతో పాటు జిల్లా నలుమూలల నుంచి భారీగా తరలివచ్చిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బైక్ ర్యాలీలు, బాణసంచా మోతలు, నినాదాలతో అల్లీపురాన్ని హోరెత్తించారు. ఈ సందర్భంగా అల్లీపురంలో తన జన్మదినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని సోమిరెడ్డి ప్రారంభించారు. నోవా బ్లడ్‌బ్యాంక్ వారి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ శిబిరంలో సుమారు 150 మందికిపైగా యువత రక్తదానం చేశారు. అల్లీపురంతోపాటు వెంకటాచలంలో కూడా రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదాతలకు ఆయన సర్టిఫికెట్లను ఇచ్చి అభినందించారు. అనంతరం పెద్దఎత్తున బాణసంచా వేడుకలతో ఊరంతా మార్మోగిపోయింది. మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు, తెలుగుమహిళ అధ్యక్షురాలు పనబాక భూలక్ష్మి, టిడిపి నాయకులు జెన్ని రమణయ్య, కప్పిర శ్రీనివాసులు, రేవతి, షేక్ రసూల్, ఖాదర్‌బాషా, సాబిర్‌ఖాన్, జలదంకి సుధాకర్, నెల్లూరు మురళినాయుడు, ఆత్మకూరు టిడిపి నాయకులు తుమ్మల చంద్రారెడ్డి, కేతా విజయభాస్కర్‌రెడ్డి, సోమిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, బొమ్మి సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com